SPECIAL EDITION

www.specialeditiondaily.com

స్పెషల్ ఎడిషన్

తెలుగు దినపత్రిక

ON TV TELUGU

PRGI NO. TGTEL/26/A0688

రంగారెడ్డి సంపుటి: 01, సంచిక : 278, సంపాదకులు : యస్.బి.ఎన్ చారి ఆదివారం, నవంబర్ 8, 2026 పేజీలు : 8, వెల : రూ.6/-

టుడే స్పెషల్

దీపావళి వెలుగులు..
ప్రతి ఇంటా ఆనందాలు!

చీకటిని చీల్చే దీపం.. చింతలను చెరిపే కాంతి!
చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి!
మట్టి ప్రమిదలో వెలిగే చిన్న దీపమైనా..
మనిషి జీవితంలో నింపాలి వెలకట్టలేని వెలుగైనా!
వెలుగుల పండుగ ప్రతి గుండెలో ఆనందం నింపాలి,
ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలి!
ఆశల దీపాలు ఆరిపోకుండా వెలుగుతుండాలి,
ఆప్యాయతల అనుబంధాలు కలకాలం నిలవాలి!
మతాలకు అతీతంగా మానవత్వం వెలగాలి,
కులాలకు అతీతంగా ఐక్యత పరిఢవిల్లాలి!
ద్వేషాల చీకట్లు తొలగి.. ప్రేమ దీపాలు వెలగాలి,
కష్టాల కన్నీళ్లు కరిగి.. సంతోషాలు వెల్లువెత్తాలి!
ప్రతి అడుగులో విజయం.. ప్రతి క్షణంలో సంతోషం,
ప్రతి మనసులో నమ్మకం.. ప్రతి ఇంటా సౌభాగ్యం!
ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆయురారోగ్యాలతో
మీ జీవితాలు నిత్యం దీపకాంతులై ప్రకాశించాలి!
దీపావళి అంటే కేవలం దీపాల పండుగ కాదు..
మనసుల్లో మంచితనాన్ని వెలిగించే మహోన్నత పండుగ!
ఈ దీపావళి మీ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, సుఖశాంతులు, సంతోషాలు, విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ...

దీపావళి శుభాకాంక్షలతో..
స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక

కొడంగల్‌లో ఇండస్ట్రియల్ హబ్



943.34 ఎకరాల్లో పారిశ్రామిక వాడ అభివృద్ధి
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభం
రూ.661.91 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక
రెండు పరిశ్రమలకు 96 ఎకరాల భూమి కేటాయింపు
రూ.252.86 కోట్ల పెట్టుబడులు.. 535 మందికి ఉద్యోగ అవకాశాలు

కొడంగల్, నవంబర్ 7 (స్పెషల్ ఎడిషన్):

తెలంగాణ పారిశ్రామిక ప్రగతిలో కొడంగల్ ప్రాంతాన్ని మరో కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామీణ వ్యవసాయ ప్రాంత ఆర్థిక వ్యవస్థ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ–రేర్)లో భాగంగా కొడంగల్‌ను ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో హకీంపేటలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ప్రదర్శనకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొడంగల్‌ను కేంద్రంగా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ ప్రదర్శన నాంది పలికింది. ఇప్పటివరకు హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలకే ఎక్కువగా పరిమితమైన పారిశ్రామిక అభివృద్ధిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలన్న దూరదృష్టితో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. స్థానిక వనరులు, వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక అవకాశాలను సమన్వయం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోనే ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా ఇండస్ట్రియల్ హబ్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల స్థానిక యువత ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతం లభించనుంది.

943 ఎకరాల్లో పారిశ్రామిక వాడ... కొడంగల్ ఇండస్ట్రియల్ హబ్‌ను మొత్తం 943.34 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు. వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలను ఆకర్షించేలా భూముల కేటాయింపు, రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. ఈ హబ్‌కు అవసరమైన భూసేకరణ కోసం ఇప్పటికే రూ. 220 కోట్లు వ్యయం చేయగా, రోడ్లు, నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి మరో రూ. 441.91 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. మొత్తంగా భూసేకరణ, మౌలిక సదుపాయాల కోసం రూ. 661.91 కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నారు.

రెండు సంస్థలకు భూముల కేటాయింపు

ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే రెండు సంస్థలకు మొత్తం 96 ఎకరాల భూమిని కేటాయించారు. బిర్లాను లిమిటెడ్ సంస్థకు ఫైబర్ సిమెంట్ బోర్డుల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు, ఎకోపామ్ ఆయిల్ అండ్ ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు వెజిటబుల్ ఆయిల్స్ తయారీతో పాటు వ్యవసాయ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల కోసం భూములు కేటాయించారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా స్థానికంగా లభించే వనరులకు అదనపు విలువ చేకూర్చే అవకాశాలు కూడా ఏర్పడనున్నాయి.

రూ.252 కోట్ల పెట్టుబడులు.. 535 ఉద్యోగాలు

ఈ రెండు సంస్థలు కలిపి దాదాపు రూ. 252.86 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలను స్థాపించనున్నాయి. వీటి ద్వారా సుమారు 535 మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్ష ఉద్యోగాలకే కాకుండా రవాణా, సరఫరా, నిర్వహణ, ఇతర అనుబంధ రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు ఈ పరిశ్రమలు దోహదపడనున్నాయి.

మిగతా 2వ పేజీలో...



మెగా రైతు మేళా

- హకీంపేటలో మెగా రైతు మేళా ప్రారంభం
- రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడమే లక్ష్యం
- వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక యంత్ర పరికరాలతో ప్రత్యేక స్టాళ్లు
- ఏరోస్పేస్, రక్షణ రంగ సాంకేతికతకు పారిశ్రామిక ప్రదర్శనలో చోటు
- గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన వనరులపై అవగాహన
- స్టాళ్లను పరిశీలించి ఉత్పత్తుల వివరాలు తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి

3

జిల్లాల మధ్య నీటి వివాదాలు
సృష్టిస్తున్నారు

ఏదుల నుంచి డిండికి నీళ్లు తెస్తామన్న సీఎం..
తొమ్మిది సర్వేలు చేసినా డిండికి నీళ్లు ఎక్కడి నుంచి తీసుకోవాలో చెప్పలేదు : కవిత

డిండి, నవంబరు 7 (స్పెషల్ ఎడిషన్):

ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నిరర్థక ఆస్తి(నాన్ పర్ఫార్మింగ్ అసెట్)గా మిగిలిపోయిందని తెలంగాణ రక్షణ సమితి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.



మిగతా 2వ పేజీలో...

ఓటరుకు మరో ఛాన్స్

ముసాయిదా ఓటరు జాబితాలో పేరు గల్లంతైన అర్హులకు అవకాశం

తుది ఓటరు జాబితాలో పేరు చేర్చుకునేందుకు ఎన్నికల సంఘం వెసులుబాటు
ఈ నెల 21వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలి
ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయాలి
కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమీక్ష



రంగారెడ్డి జిల్లా, నవంబర్ 7 (స్పెషల్ ఎడిషన్):

ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేకపోయినా అర్హత కలిగిన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తుది ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా వివిధ కారణాలతో ముసాయిదా జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లను గుర్తించి, వారికి మరో అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లకు తిరిగి అవకాశం కల్పించే అంశాలపై సమీక్షించారు.

మిగతా 2వ పేజీలో...

మత్తు మాఫియాకు
ఎస్ఓటీ షాక్!

ఒడిశా నుంచి హైదరాబాద్ మీదుగా ముంబైకి మత్తు సరుకు!
ఘట్‌కేసర్ శివారులో ఎస్ఓటీ పోలీసుల మెరుపుదాడి
రూ.30 లక్షల విలువైన 60 కిలోల గంజాయి పట్టివేత
పాత నేరచరిత్ర ఉన్న ఇద్దరు కేటుగాళ్లు అరెస్ట్
కిలో రూ.7 వేలకు కొనుగోలు.. రూ.15 వేలకు అమ్మకమే లక్ష్యం!



హైదరాబాద్, నవంబర్ 7 (స్పెషల్ ఎడిషన్):

గంజాయి అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందా? రాష్ట్రాలు దాటుతూ మత్తు వ్యాపారాన్ని విస్తరిస్తున్న

2లో...

8 లక్షల ఇళ్ల లక్ష్యం!

రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్ల మంజూరు

మొత్తం 8 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ.40 వేల కోట్లు

అర్హతే ప్రామాణికం.. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఎంపిక
నందిగామలో రూ.2 కోట్లతో పీఎంశ్రీ పాఠశాల భవనం ప్రారంభం
తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటుకు మంత్రి పొంగులేటి ప్రకటన





షాద్‌నగర్, నవంబర్ 7 (స్పెషల్ ఎడిషన్):


రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, ప్రజల అభ్యున్నతి, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎలాంటి వివక్షకు తావుండదని భరోసా ఇచ్చారు. శనివారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నందిగామ గ్రామంలో ఇద్దరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని ఇళ్లను ప్రారంభించారు. అనంతరం మహిళా సమాఖ్య భవనం, అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించిన పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. నందిగామ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు.

మిగతా 2వ పేజీలో...

నాయకుల ఇళ్లలో దీపావళి..
విశ్వకర్మ గడపల్లో చీకటేనా?

సమాజం పేరు చెప్పుకుని స్వార్థ రాజకీయాలా?

పదవుల కోసం పోటీ.. ప్రజల సమస్యలపై మౌనం!
ఆత్మగౌరవ భవనం జీవోలకే పరిమితం..
ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులేనా?
నాయకుల హోదాలు పెరుగుతున్నాయి.. విశ్వకర్మ కుటుంబాల బతుకులు మారుతున్నాయా?
ఇక మాటలు వద్దు.. చేసిన సేవల లెక్కలు చెప్పండి!



హైదరాబాద్, నవంబర్ 7 (స్పెషల్ ఎడిషన్):

విశ్వకర్మ సమాజం అభివృద్ధి చెందాలనే ఆశతో నాయకులను నమ్మి బాధ్యతలు అప్పగిస్తే.. ఆ నమ్మకానికి తగ్గట్టుగా సమాజంలో మార్పు కనిపిస్తోందా? నాయకులుగా ఎదిగిన కొందరి జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ, సాధారణ విశ్వకర్మ కుటుంబాల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు ఎందుకు రావడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సమాజం పేరు చెప్పుకుని పదవులు పొందడం, హోదాలు ప్రదర్శించడం, సమావేశాలు నిర్వహించడం, ఫొటోలు దిగడం, ప్రకటనలు ఇవ్వడం మాత్రమే నాయకత్వమా?

మిగతా 2వ పేజీలో...

ఎల్‌నినో ఎఫెక్ట్..
రైతులు అప్రమత్తం!

వచ్చే 8 నెలలు గడ్డు పరిస్థితులు.. ఆరుతడి పంటలే సాగు చేయాలి
రైతులు పంటలు వేసే ముందు ఆలోచించాలి.. ప్రభుత్వం అండగా ఉంటుంది
ప్రాజెక్టుల్లో అడుగంటిన నీరు.. సమష్టిగా కరువును ఎదుర్కొందాం
డిసెంబర్‌లో సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు
హైదరాబాద్ నుంచి లగచర్ల వరకు ఇండస్ట్రియల్ హబ్..
రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులు



కొడంగల్, నవంబర్ 7 (స్పెషల్ ఎడిషన్):

ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో నెలకొంటున్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, రాబోయే రోజుల్లో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీరు అవసరమయ్యే

మిగతా 4వ పేజీలో...



ఈ20 కాదు.. 420

ఎక్స్ వేదికగా రాహుల్‌గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ: పెట్రోల్‌లో 20% పరిమితికి మించి ఇథనాల్‌ను కలుపుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. కేం ద్రం చెబుతున్న ఈ-20 విధానం (పెట్రోల్‌లో 20% ఇథనాల్ మిశ్రమం) ఈ-420గా (మోసం) మారిందని ఎక్స్ వేదికపై చేసిన పోస్టులో వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రభుత్వం పెట్రోల్ బంకుల నుంచి నమూనాలు సేకరించి ప్రయోగశాలలో

మిగతా 2వ పేజీలో...

కొడంగల్‌లో ఇండస్ట్రియల్ హబ్

మొదటి పేజీ తరువాయి...

పారిశ్రామిక ప్రదర్శనలో ప్రముఖులు

హకీంపేటలో నిర్వహించిన పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కొడంగల్‌ను కేవలం వ్యవసాయ ప్రాంతంగానే కాకుండా పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కలగలిసిన సమగ్ర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ ఇండస్ట్రియల్ హబ్ కీలకం కానుంది. ప్రణాళికలు కార్యరూపం దాల్చి మరిన్ని పరిశ్రమలు ఇక్కడకు వస్తే కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాల ఆర్థిక, సామాజిక ముఖచిత్రం మారే అవకాశం ఉంది.

జిల్లాల మధ్య నీటి వివాదాలు సృష్టిస్తున్నారు

మొదటి పేజీ తరువాయి...

అధికారంలో ఉన్నప్పుడు తొమ్మిది సర్వేలు చేసిన బీఆర్ఎస్.. డిండి ఎత్తిపోతలకు ఎక్కడి నుంచి నీళ్లు తీసుకోవాలో చెప్పలేకపోయిందని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఏదుల నుంచి డిండికి నీళ్లు తెస్తామని చెప్పి.. జిల్లాల మధ్య నీటి వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టును శనివారం సందర్శించిన కవిత.. ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. డిండి ఎత్తిపోతలకు ఏదుల నుంచి నీరు తేవడం అంత సులువుకాదని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఎల్లూరు పంపుహౌస్ కోసం చేపట్టిన బ్లాస్టింగ్‌తో కల్వకుర్తి పంపుహౌస్‌లో ఒక పంపు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. ప్రస్తుతం 0.6 టీఎంసీల కోసం మరో సోర్సు కోసం పంపుహౌస్ తవ్వితే కల్వకుర్తి, పాలమూరు పంపుహౌస్‌లకు ప్రమాదం తప్పదని హెచ్చరించారు. ఇన్ని అడ్డంకుల మధ్య ఏదుల నుంచి డిండికి లింకు చేస్తామనడం, రెండు జిల్లాల ప్రజల మధ్య నీటి వివాదాలు సృష్టించడమేనని అన్నారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ నీటితో బస్వాపూర్ మీదుగా డిండి ఎత్తిపోతలకు నీళ్లు ఇవ్వడమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. లేదంటే బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం, కిష్టరాయన్‌పల్లి మీదుగా డిండికి నీటిని తరలించవచ్చని ప్రతిపాదించారు. మూడో ప్రతిపాదనగా మల్లన్న సాగర్ నుంచి కొండపోచంపల్లికి అక్కడి నుంచి శామీర్‌పేట చెరువు, శివన్నగూడెంల నుంచి డిండి రిజర్వాయర్‌ను నింపవచ్చని సూచించారు. కృష్ణా జలాలను కాపాడుకునేందుకు గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రయత్నించలేదని ఆరోపించారు. కాగా, ఎల్‌నినో నేపథ్యంలో ప్రతి ఎకరాకు రూ.25వేలు పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని కవిత పిలుపునిచ్చారు.

ఓటరుకు మరో ఛాన్స్

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, డూప్లికేట్ (ఏఎస్‌డీడీ) కేటగిరీల కింద గుర్తించబడి ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారిలో అర్హులైన ఓటర్లను గుర్తించి, వారి పేర్లు తుది జాబితాలో చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో జాబితాలు

ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రదర్శించాలని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి సంబంధిత ఓటర్లను నేరుగా సంప్రదించాలని, వారికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి వాటిని ఎలా నింపాలి, ఎక్కడ సమర్పించాలి అనే అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అవసరమైన వివరాలు, ప్రకటన పత్రాలను అనుబంధం-ఎ, బి, సి ద్వారా సమర్పించే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు... అర్హులైన ఓటర్లు సంబంధిత ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్ఓ), బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)లకు నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. అదేవిధంగా ఈసీఐ నెట్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అదే చిరునామాలో నివసిస్తున్న ఓటర్లు తగిన ప్రకటనతో పాటు ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాలని సూచించారు. రాష్ట్రంలోని మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్న వారు పాత, కొత్త చిరునామాల వివరాలతో పాటు నివాస ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఫారం-6 సమర్పించిన వారికి మినహాయింపు

ఎస్ఐఆర్ ప్రక్రియలో కొత్త ఓటరు నమోదుకు ఇప్పటికే ఫారం-6 సమర్పించిన వారు మరోసారి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అవకాశంపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన తదితర ప్రక్రియలను పూర్తి చేసి ఈ నెల 21వ తేదీలోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

అర్హులందరికీ అవకాశం: కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించేలా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు తుది ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మత్తు మాఫియాకు ఎస్ఓటీ షాక్!



మొదటి పేజీ తరువాయి...

ముఠాలు యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయా? ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి, హైదరాబాద్‌ను రవాణా మార్గంగా ఉపయోగించుకుంటూ ముంబైలో భారీ ధరకు విక్రయించేందుకు సాగుతున్న అంతర్రాష్ట్ర గంజాయి దందాను మల్కాజిగిరి పోలీసులు బట్టబయలు చేశారు. కారులో రహస్యంగా తరలిస్తున్న 60 కిలోల గంజాయిని ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ బృందం, పోచారం ఐటీ కారిడార్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.30 లక్షలు. ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, అసలు సరఫరాదారు, ముంబైలో సరుకు స్వీకరించాల్సిన వ్యక్తి మాత్రం ఇంకా చిక్కలేదు. రవాణాదారులు పట్టుబడ్డారు.. కానీ ఈ మత్తు వ్యాపారం వెనుక ఉన్న అసలు సూత్రధారులెవరు? అన్న ప్రశ్న ఇప్పుడు కీలకంగా మారింది.

రహస్య రవాణాకు కారు.. వెనుక సీటే గోదాం!

గంజాయి రవాణా కోసం కారునే రహస్య గోదాంగా మార్చేశారు. మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్ MH-04-DN-4933 కలిగిన మారుతి సుజుకి ఎస్ఎక్స్4 కారులో వెనుక సీటు వెనుక భాగంలో గంజాయి ప్యాకెట్లను దాచిపెట్టి తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ బృందం, పోచారం ఐటీ కారిడార్ పోలీసులతో కలిసి నవంబర్ 7న ఉదయం 11.30 గంటలకు ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడ గ్రామ శివారులోని మసాలా కంపెనీ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టింది. అనుమానాస్పద కారును ఆపి తనిఖీ చేయగా 60 ప్యాకెట్లలో సుమారు 60 కిలోల గంజాయి బయటపడింది. కారులో ఉన్న మహమ్మద్ అమెర్ (28), మహమ్మద్ ఇమ్రాన్ ఉద్దీన్ అలియాస్ ఇమ్రాన్ అలియాస్ జిద్దీ (35)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రూ.7 వేలకు కొనుగోలు.. రూ.15 వేలకు అమ్మకం!

మత్తు వ్యాపారంలో లాభాల లెక్కలు చూస్తే అక్రమ దందా ఏ స్థాయిలో సాగుతోందో అర్థమవుతుంది. ఒడిశాకు చెందిన పూర్ణచంద్ర మొహపాత్ర అలియాస్ హ్యాపీ అలియాస్ శివ అలియాస్ హరిహర నుంచి కిలో గంజాయిని సుమారు రూ.7 వేల చొప్పున కొనుగోలు చేసినట్లు నిందితులు వెల్లడించారు. అదే సరుకును ముంబైలో కిలోకు రూ.15 వేల చొప్పున విక్రయించేందుకు పథకం వేసినట్లు విచారణలో తెలిపారు. అంటే కిలోపై సుమారు రూ.8 వేల లాభం ఆశిస్తూ 60 కిలోల సరుకుతో అంతర్రాష్ట్ర ప్రయాణానికి తెరలేపారు. ఈ సరఫరాదారు గతంలోనూ రెండుసార్లు గంజాయి అందించినట్లు నిందితులు వెల్లడించడం ఈ దందా ఒక్కరోజు వ్యవహారం కాదనే అనుమానాలకు తావిస్తోంది.

నేర చరిత్ర ఉన్నా.. మారని బుద్ధి!

పట్టుబడిన నిందితులిద్దరికీ గతంలోనూ నేరాలతో సంబంధాలున్నట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. మహమ్మద్ అమెర్‌పై కంచన్‌బాగ్, చౌటుప్పల్, నార్సింగి, ఛత్రినాక, షాహ్ అలీ బండ పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన ఐదు కేసులు నమోదయ్యాయి. ఛత్రినాక, షాహ్ అలీ బండ పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండుసార్లు పీడీ యాక్ట్ కింద నిర్బంధించినట్లు పోలీసులు వెల్లడించారు. మరో నిందితుడు ఇమ్రాన్ ఉద్దీన్‌పై గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు, మైలార్‌దేవ్‌పల్లిలో దోపిడీ కేసుతో పాటు గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నాయి. ఇన్ని కేసులు, నిర్బంధాలు ఎదురైనా మత్తు వ్యాపారానికి దూరం కాకపోవడం నేరగాళ్ల తెగింపునకు నిదర్శనంగా కనిపిస్తోంది.

అసలు డాన్‌లు ఎక్కడ?

ఈ అక్రమ రవాణా వ్యవహారంలో ఒడిశాకు చెందిన పూర్ణచంద్ర మొహపాత్ర గంజాయి సరఫరాదారుగా, ముంబై ధారావికి చెందిన యాస్మిన్ చంద్ సయ్యద్ అలియాస్ చంద్ భాయ్ సరుకు స్వీకర్తగా ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే వీరిద్దరూ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడినా సరఫరా, స్వీకరణ వ్యవస్థలో కీలకంగా ఉన్న వ్యక్తులు ఇంకా పోలీసులకు చిక్కకపోవడం గమనార్హం. గతంలో రెండుసార్లు సరఫరా జరిగినట్లు వెల్లడైన నేపథ్యంలో ఆ సరుకులు ఎక్కడికి చేరాయి? ఎవరికి విక్రయించారు? హైదరాబాద్‌లో మరెవరైనా ఈ ముఠాకు సహకరిస్తున్నారా? అన్న కోణాల్లో సమగ్ర దర్యాప్తు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మత్తు మహమ్మారిపై పోలీసుల ఉక్కుపాదం

ఈ ఘటనపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 613/2026 కింద ఎన్‌డీపీఎస్ చట్టం 1985లోని 8(సి) రెడ్‌విత్ 20(బి)(ii)(సి), 29 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్, అదనపు డీసీపీ ఎండీ షకీర్ హుస్సేన్,



ఉప్పల్ జోన్ అదనపు డీసీపీ ఎన్. వెంకటరమణ, మేడిపల్లి ఏసీపీ బి. మోహన్ కుమార్, పోచారం ఐటీ కారిడార్ ఇన్‌స్పెక్టర్ జి. జగన్నాథ్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ కె. ప్రతాప్ రెడ్డి, ఎస్ఓటీ బృందం, పోచారం పోలీసుల సమన్వయంతో ఈ ఆపరేషన్ విజయవంతమైందని ఎల్బీనగర్ డిసిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎల్‌బీనగర్ జోన్, ఉప్పల్ జోన్ ఇన్‌చార్జి డీసీపీ డాక్టర్ బి. అనురాధ వెల్లడించారు. గంజాయి విక్రేతలు, సరఫరాదారులు, వినియోగదారులను గుర్తించి మత్తు పదార్థాల సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించడమే లక్ష్యమని మల్కాజిగిరి పోలీసులు స్పష్టం చేశారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

8 లక్షల ఇళ్ల లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి...

పాత జాతీయ రహదారి-7 నుంచి నర్సప్పగూడ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు.

8 లక్షల ఇళ్లు.. రూ.40 వేల కోట్ల వ్యయం

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు ఆశలు కల్పించినప్పటికీ, ఆచరణలో చాలామందికి ఇళ్లు అందలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరానికి అదనంగా లక్ష ఇళ్లు కేటాయించినట్లు వివరించారు. మొత్తంగా 8 లక్షల ఇళ్ల నిర్మాణానికి సుమారు రూ.40 వేల కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2,25,100 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఆర్థిక సాయాన్ని ఎలాంటి అవినీతి, లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహించేందుకు 'ఈ దీపావళి మా దీపావళి' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు గృహప్రవేశాలు, నూతన గృహాల ఫొటోల అప్‌లోడ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

హామీల అమలే ప్రభుత్వ లక్ష్యం

ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సన్నధాన్యం సాగు చేసే రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు సుమారు రూ.73 వేల కోట్ల రుణాలను సున్నా వడ్డీపై అందించినట్లు వెల్లడించారు.

భూభారతితో భూ సమస్యలకు చెక్

రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే సంకల్పంతో ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. ప్రతి భూమి పార్సిల్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని, రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని మొత్తం 10,456 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. సర్వే అనంతరం ప్రతి భూమికి క్యూఆర్ కోడ్‌తో కూడిన మ్యాప్, భూధార్ నంబర్‌తో కూడిన పాస్‌బుక్ అందజేస్తామని తెలిపారు. తద్వారా భూ యాజమాన్య హక్కులు, సరిహద్దులు, రికార్డులకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని వెంకిరాల గ్రామంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో పరిష్కరించి, అర్హులైన వారికి పట్టాదారు పాస్‌బుక్కులు అందించే చర్యలు చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సిద్దాపురంలో డంపింగ్ యార్డు వద్దు

సిద్దాపురం ప్రాంతంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డు వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులు, ప్రజలకు కలిగే ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని సిద్దాపురంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోదని, ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని భరోసా ఇచ్చారు.

నందిగామకు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలు

షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. నియోజకవర్గంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తూ అభివృద్ధి పనుల మంజూరు కోసం ఆయన పట్టుదలతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు నందిగామ ప్రాంత ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో నందిగామ మండలంలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు ఈ సందర్భంగా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఈ కార్యాలయాల ఏర్పాటుతో స్థానిక ప్రజలు రెవెన్యూ సంబంధిత పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతి నిర్ణయాన్ని ప్రజల అవసరాలు, సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొనే తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్రమంగా మెరుగుపరుస్తూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తామని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి రాజీ ఉండబోదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓ సరిత, పీడీ హౌసింగ్ చంప్లా నాయక్, పీడీ డీఆర్డీఏ శ్రీలత, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ఇళ్లలో దీపావళి.. విశ్వకర్మ గడపల్లో చీకటేనా?

మొదటి పేజీ తరువాయి...

పేద కుటుంబాల కన్నీళ్లు తుడవడం, చేతివృత్తిదారులకు చేయూతనివ్వడం, నిరుద్యోగ యువతకు ఉపాధి చూపించడం, విద్యార్థులకు అండగా నిలవడం ఎవరి బాధ్యత?

సమాజం కోసం నాయకులా? నాయకుల కోసం సమాజమా?

ఒక నాయకుడు ఎదిగితే సమాజం ఎదిగినట్లా? ఒక పదవి దక్కితే వేల కుటుంబాల సమస్యలు పరిష్కారమైనట్లా? ఒక సమావేశం నిర్వహిస్తే అభివృద్ధి జరిగినట్లా? సమాజం పేరుతో గుర్తింపు పొందిన నాయకులు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. విశ్వకర్మ సమాజంలో ఎంతోమంది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నాయి. సంప్రదాయ వృత్తులు గిట్టుబాటు కాక యువత ఇతర ఉపాధి మార్గాల కోసం వెతుకుతోంది. విద్యకు, వైద్యానికి ఖర్చు భరించలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు ఉన్నాయి. అలాంటి వారి కోసం నాయకత్వం ఏం చేసింది? ఎన్ని కుటుంబాలకు సహాయం అందించింది? ఎంతమంది యువతకు ఉపాధి కల్పించింది? ఎంతమంది విద్యార్థులకు విద్యా సహాయం అందించింది? సమాజం పేరుతో పదవులు పొందినవారు తమ సేవల నివేదికను ప్రజల ముందు పెట్టాలి. నాయకత్వం అనేది వ్యక్తిగత ప్రతిష్ఠకు వేదిక కాదు.. సామాజిక బాధ్యతకు నిదర్శనం కావాలి.

ఆత్మగౌరవ భవనం.. జీవోలకే పరిమితమైన కల!

విశ్వకర్మ సమాజానికి ఆత్మగౌరవ భవనం నిర్మించాలన్న ఆశయం సంవత్సరాలుగా కొనసాగుతోంది. 2018లో జీవో నంబర్ 20 ద్వారా వివిధ బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి సంబంధించి రూ.60.25 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఈ మొత్తం 32 బీసీ సంఘాలకు సంబంధించినది. అందులో విశ్వబ్రాహ్మణ భవనానికి ప్రత్యేకంగా ఎంత కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? ఏ మేరకు పనులు జరిగాయి? అనే లెక్కలు మాత్రం సమాజానికి స్పష్టంగా తెలియాలి. నిర్మాణానికి అవసరమైన చర్యలు ఎందుకు ఆలస్యమయ్యాయి? ఇన్నేళ్లుగా నాయకులు ఏం చేశారు? అధికారుల చుట్టూ తిరిగినట్లు చెప్పుకోవడం ఒకటైతే, ఫలితం చూపించడం మరొకటి. ఎనిమిదేళ్ల నిరీక్షణకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది?

రూ.5 కోట్ల జీవోతోనే ఆత్మగౌరవం వచ్చేస్తుందా?

2026 నవంబర్ 2న జీవో నంబర్ 49 ద్వారా ఉప్పల్ భగాయత్‌లో ఐదెకరాల్లో విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.5 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరైంది. ఇది ఆహ్వానించదగిన పరిణామమే. కానీ జీవో విడుదలైనంత మాత్రాన భవనం నిర్మాణం పూర్తయినట్లు కాదు. నిధులు విడుదల కావాలి. నిర్మాణ పనులు ప్రారంభం కావాలి. నాణ్యతతో పనులు జరగాలి. నిర్ణీత గడువులో భవనం పూర్తిచేసి సమాజానికి అందించాలి. జీవో కాపీని పట్టుకుని ప్రచారం చేసుకోవడం కంటే, నిర్మాణం ఎప్పుడు మొదలవుతుంది? ఎప్పటికి పూర్తవుతుంది? నిధుల వినియోగంపై పారదర్శకత ఎలా ఉంటుంది? అనే అంశాలపై నాయకులు సమాధానం చెప్పాలి. సమాజానికి కావాల్సింది శుభాకాంక్షల పోస్టర్లు కాదు.. ఉపయోగపడే భవనం.

పదవులు శాశ్వతం కాదు.. సమాజం శాశ్వతం!

కమిటీల్లో పదవులు చేపట్టినవారు, సంఘాలకు నాయకత్వం వహించినవారు తమ పదవీకాలంలో సాధించిన ప్రగతిని వెల్లడించాలి. కమిటీలు మారినా, పదవులు మారినా సమాజ సమస్యలు మాత్రం అలాగే ఉండిపోవడం ఎందుకు? ఒక కమిటీ రద్దయితే మరో కమిటీ ఏర్పడాలి. కానీ సమాజ అభివృద్ధి ఆగిపోకూడదు. గతంలో బాధ్యతలు నిర్వహించినవారు తమ పనితీరుకు జవాబు చెప్పాలి. ప్రస్తుతం బాధ్యతల్లో ఉన్నవారు కార్యాచరణ ప్రకటించాలి. ఎవరికి ఏ హోదా ఉంది? ఎవరు అధికారికంగా నియమితులయ్యారు? ఎవరి బాధ్యత ఎంతవరకు ఉంది? అనే విషయాల్లో స్పష్టత ఉండాలి. గత పదవులను ప్రస్తుత అధికారాలుగా చూపించకూడదు. సమాజం పేరుతో మాట్లాడేవారు సమాజానికి జవాబుదారీగా ఉండాలి.

స్వార్థానికి స్వస్తి.. సమాజ సేవకు శ్రీకారం!

విశ్వకర్మ సమాజానికి కావాల్సింది వ్యక్తిగత ఆధిపత్య పోరాటాలు కాదు. పరస్పర ఆరోపణలు కాదు. పదవుల కోసం వర్గాలుగా విడిపోవడం కాదు. ఐక్యతతో అభివృద్ధి సాధించే కార్యాచరణ కావాలి. ప్రతి జిల్లాలో సమాజ బలోపేతానికి ప్రణాళిక ఉండాలి. చేతివృత్తిదారులకు ఆధునిక పరికరాలు, యువతకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధికి రుణ సదుపాయాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. నాయకులు ముందుగా తమ స్వార్థ ప్రయోజనాల కంటే సమాజ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పదవులు పొందినవారు ఆ పదవులకు తగిన సేవ చేయాలి. సమాజం కోసం పోరాడుతున్నామని చెప్పేవారు తమ పోరాట ఫలితాలను ప్రజలకు చూపించాలి.

విశ్వకర్మ సమాజం నుంచి నాయకులకు సూటి ప్రశ్న!

మా పేరుతో పదవులు పొందారు.. మా పేరుతో గుర్తింపు తెచ్చుకున్నారు.. మా పేరుతో సమావేశాలు నిర్వహించారు.. మరి మా కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఏం చేశారు? ఆత్మగౌరవ భవనం ఎప్పుడు నిర్మిస్తారు? పేద విశ్వకర్మ కుటుంబాలకు ఎప్పుడు అండగా నిలుస్తారు? నిరుద్యోగ యువతకు ఎప్పుడు ఉపాధి చూపిస్తారు? చేతివృత్తులకు ఎప్పుడు ప్రోత్సాహం కల్పిస్తారు? గతంలో తీసుకున్న బాధ్యతలకు లెక్కలు ఎప్పుడు చెబుతారు? ఈ ప్రశ్నలు ఏ ఒక్క వ్యక్తిని కించపరచడానికి కాదు.. సమాజం పేరుతో బాధ్యతలు చేపట్టిన ప్రతి నాయకుడిని ఆత్మపరిశీలన చేసుకోమనే హెచ్చరిక. నాయకులు మారాలి.. నాయకత్వ ధోరణి మారాలి.. సమాజం అభివృద్ధి చెందాలి. ఇకపై హోదాల ప్రదర్శనకు కాదు, సేవల ప్రదర్శనకు ప్రాధాన్యత ఇవ్వాలి. నాయకుల ఇళ్లలో దీపాలు వెలిగితేనే సమాజం వెలిగినట్లు కాదు.. చివరి విశ్వకర్మ కుటుంబం గడపలోనూ వెలుగు కనిపించినప్పుడే నిజమైన ఆత్మగౌరవం సాధించినట్లు! జీవోలతో కాదు.. చేతలతో నిరూపించండి. పదవులతో కాదు.. సేవలతో చరిత్ర సృష్టించండి!

త్వరలో పార్ట్-5

రేవంత్.. కమీషన్ల కోసమే మూడేళ్లు సెలవు తీసుకోలేదా?: మాజీ మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర విమర్శ లు చేశారు. కొడంగల్ అభివృద్ధికి గత బీఆర్ ఎస్ ప్రభుత్వం చేసిన పనులను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం వాటిని కొనసాగించడంలో విఫలమైందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం శేఖర్‌రావుపే టలో వాటర్ ప్లాంట్‌ను హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొడంగల్, సిద్దిపేటలో అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి గత, ప్రస్తుత ప్రభుత్వాలను పోలుస్తూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. కొడంగల్‌లో తాను ఏం చేశానని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని, కేసీఆర్ హయాంలో కొడంగల్‌లో రెండు 50 పడకల ఆస్పత్రులను నిర్మించామని తెలిపారు. ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు తండాలకు రోడ్లు, 24 గంటల విద్యుత్ సరఫ రా కల్పించామని పేర్కొన్నారు. చెరువులన్నిం టినీ అభివృద్ధి చేశామని, ప్రతి మండలానికి ఒక గోదామును నిర్మించామని వివరించారు. అయితే, సిద్దిపేట అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు కీలక ప్రశ్నలు సంధించారు. సిద్దిపేటలోని వెటర్నరీ కళాశాల ను కొడంగల్‌కు తరలించారని ఆయన ఆరోపిం చారు. రంగనాయక సాగర్ కాలువల పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిందని, మిగిలిన 10 శాతం పనులను మూడేళ్లయినా ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. వెయ్యి పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను కూడా మధ్యలోనే నిలిపివేశారని ఆరోపించారు. మూడేళ్లలో ఒక్కరోజూ సెలవు తీసుకోకుండా పనిచేశానని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అయితే ఆ కష్టం ప్రజల కోసమా, లేక కమీషన్ల కోసమా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలోనూ కేసీఆర్ రైతుబంధు నిధులు విడుదల చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం మూడు పంట లకు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు.

స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక

సూర్యాపేటలో 1.5 కిలోల

గంజాయి పట్టివేత.. నలుగురు అరెస్ట్..

ఇద్దరు ప్రధాన నిందితులు పరారీ ఒడిశా సరిహద్దు నుంచి గంజాయి తెప్పించి విక్రయించేందుకు యత్నం



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, నవంబర్ 7 (స్పెషల్ ఎడిషన్):

సూర్యాపేట పట్టణంలో గంజాయి అక్రమ విక్రయాలపై పోలీసులు దాడులు నిర్వహించి 1,500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, గంజాయి సరఫరాలో కీలకంగా వ్యవహరించిన మరో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారు. సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై రామచంద్ర గౌడ్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం పట్టణంలోని చివ్వెంల రహదారిలో అమ్మ గార్డెన్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో పోలీసులను గమనించిన ఇద్దరు ప్రధాన నిందితులు అక్కడి నుంచి పారిపోగా, గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 1,500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బొంత అవినాష్, సోమపంగు నాని వర్ధన్ అనే ఇద్దరు వ్యక్తులు ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చేందుకు వెళ్లినట్లు, ఇందుకు అరెస్టయిన నలుగురు వారికి డబ్బులు సమకూర్చినట్లు వెల్లడైంది. గంజాయిలో కొంత వినియోగించుకుని, మిగిలినదాన్ని విక్రయించి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ అక్రమ వ్యవహారానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. అరెస్టయిన వారిలో రూపాని సందీప్ (20), బొద్దు భరత్ (21), పులుసు సాయి విశాల్ గౌడ్, శీలం శ్రీకాంత్ లింగయ్య (24) ఉన్నారు. వీరంతా సూర్యాపేట పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు. పరారీలో ఉన్న బొంత అవినాష్, సోమపంగు నాని వర్ధన్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై రామచంద్ర గౌడ్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీరాములు, జి. వీరయ్య, అజ్గర్ అలీ, రామనర్సయ్య, కానిస్టేబుళ్లు కొండా రమేష్, ఎన్. నవీన్‌లను పోలీసు అధికారులు అభినందించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు మరో అవకాశం

నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు గడువు



ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, నవంబర్ 07 (స్పెషల్ ఎడిషన్):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR)–2026లో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. నవంబర్ 21వ తేదీ వరకు ఫారాలు సమర్పించవచ్చని స్పష్టం చేశారు. శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో SIR–2026 ప్రక్రియ, ఓటరు జాబితా సవరణ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదైన (ASDD) జాబితాలో ఉన్నప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి విచారణ చేపట్టి, ఫారాలు అందని అర్హులైన ఓటర్లను గుర్తించి తిరిగి అందజేయాలని సూచించారు. ఓటర్ల ఫోన్ నంబర్లు, ఈ–మెయిల్ వివరాలు అందుబాటులో ఉంటే వాట్సాప్, ఈ–మెయిల్ ద్వారా కూడా ఫారాలను పంపించాలని తెలిపారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద్వ ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని, ఆయా పేర్లు ఓటరు జాబితాలో లేకపోవడానికి గల కారణాలను కూడా స్పష్టంగా వెల్లడించాలని ఆదేశించారు. ఈ జాబితాలను పోలింగ్ కేంద్రాలతో పాటు ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లోనూ ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఓటర్లు తమ పాత ఓటరు గుర్తింపు కార్డు (EPIC) నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా ECINET యాప్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని తెలిపారు. గతంలో ఫారం సమర్పించలేకపోయిన వారు అందుకు గల కారణాలను వివరిస్తూ డిక్లరేషన్ ఇవ్వాలని, చిరునామా మారిన వారు కొత్త చిరునామాకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని సూచించారు. అందిన దరఖాస్తులను ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, ఎన్నికల విభాగం సిబ్బంది రాజేందర్ రెడ్డి, భరత్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

కుసుమవారిగూడెం దొంగతనం కేసును

ఛేదించిన సూర్యాపేట రూరల్ పోలీసులు

16కు పైగా దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి అరెస్ట్.. - 305 గ్రాముల వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్ స్వాధీనం



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, నవంబర్ 07 (స్పెషల్ ఎడిషన్):


సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుసుమవారిగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. 2026 ఆగస్టు 10వ తేదీ రాత్రి కుసుమవారిగూడెం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర వైన్ షాప్ షట్టర్లను పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అదే సమయంలో పక్కనే ఉన్న కిరాణా దుకాణం, కూల్‌డ్రింక్స్ షాపుల్లోనూ దొంగతనం చేసి నగదు, వెండి వస్తువులను అపహరించారు. వైన్ షాప్ క్యాషియర్ ఫిర్యాదు మేరకు సూర్యాపేట రూరల్ పోలీసులు క్రైమ్ నంబర్ 262/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 7వ తేదీ ఉదయం జనగాం ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై ఎం. అనిల్ రెడ్డి, పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతను కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం నాగంపేట గ్రామానికి చెందిన రాచపల్లి మహేష్ అలియాస్ రసపల్లి మహేష్ (33)గా గుర్తించారు. విచారణలో నేరాన్ని అంగీకరించడంతో అతని వద్ద నుంచి చోరీకి గురైన సుమారు 305 గ్రాముల వెండి గజ్జెలు, గొలుసులతో పాటు వివో మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్, వేలిముద్రల ఆధారంగా నిందితుడికి గతంలోనూ పలు దొంగతనాల కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, రామగుండం తదితర ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో అతనిపై 16కు పైగా దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. వైద్య పరీక్షల అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కేసును సమర్థవంతంగా ఛేదించి నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బంది ఉమామహేష్, అశోక్, సాయిశంకర్‌లను డీఎస్పీ వి. ప్రసన్న కుమార్, రూరల్ సీఐ జి. రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న హోంగార్డు కుటుంబానికి పోలీసుల ఆర్థిక చేయూత

సహోద్యోగులంతా కలిసి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత

ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, నవంబర్ 07 (స్పెషల్ ఎడిషన్):

విధి నిర్వహణలోనే కాకుండా తోటి సిబ్బంది కష్టసమయాల్లోనూ అండగా నిలుస్తూ సూర్యాపేట జిల్లా పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ ఇటీవల గుండెపోటుకు గురై తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం ఆయనను హైదరాబాద్‌లోని గ్లెనీగిల్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పోలీసు సిబ్బంది, అనారోగ్యంతో బాధపడుతున్న సహోద్యోగి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ పిలుపుతో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి మొత్తం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఈ నగదును చివ్వెంల ఎస్సై మహేశ్వర్ బాధిత హోంగార్డు కుటుంబ సభ్యులకు అందజేశారు. సహోద్యోగి కష్టాల్లో ఉన్నప్పుడు ఒక కుటుంబంలా అండగా నిలవడం పోలీసు



శాఖలోని ఐక్యత, మానవీయ విలువలకు నిదర్శనమని ఈ సందర్భంగా పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మెగా రైతు మేళా



హకీంపేటలో మెగా రైతు మేళా ప్రారంభం

రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడమే లక్ష్యం

వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక యంత్ర పరికరాలతో ప్రత్యేక స్టాళ్లు

ఏరోస్పేస్, రక్షణ రంగ సాంకేతికతకు పారిశ్రామిక ప్రదర్శనలో చోటు

గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన వనరులపై అవగాహన

స్టాళ్లను పరిశీలించి ఉత్పత్తుల వివరాలు తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి



హకీంపేట, నవంబర్ 7 (స్పెషల్ ఎడిషన్):

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు నూతన ఆవిష్కరణలను పరిచయం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనకు శ్రీకారం చుట్టింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో ఏర్పాటు చేసిన ఈ భారీ ప్రదర్శనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, సాంకేతిక ఆవిష్కరణలను ఒకే వేదికపై ప్రదర్శించడం ఈ మేళా ప్రత్యేకతగా నిలిచింది.

ఆధునిక వ్యవసాయానికి అద్దం పట్టేలా స్టాళ్లు

మెగా రైతు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లలో వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, పనిముట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు తయారు చేస్తున్న ఉత్పత్తులతో పాటు రైతులకు ఉపయోగపడే ఆధునిక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. సంప్రదాయ వ్యవసాయ విధానాలకు భిన్నంగా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడే నూతన ఆవిష్కరణలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు.

ఏరోస్పేస్, రక్షణ రంగ సాంకేతికత ప్రదర్శన

వ్యవసాయ ఉత్పత్తులకే పరిమితం కాకుండా పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక సాంకేతికతకు కూడా ఈ మేళాలో పెద్దపీట వేశారు. ఏరోస్పేస్, రక్షణ రంగాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక ఉత్పత్తులను ప్రదర్శించారు. అదేవిధంగా గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన వనరులు, వ్యవసాయ ఆధారిత ఇతర పరిశ్రమల సాంకేతిక పరిజ్ఞానాన్ని సందర్శకులకు పరిచయం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు పరస్పర అనుసంధానంతో అభివృద్ధి చెందేందుకు ఈ ప్రదర్శన దోహదపడేలా ఏర్పాట్లు చేశారు.

స్టాళ్లను పరిశీలించిన ముఖ్యమంత్రి

మేళా ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి వివిధ స్టాళ్లను సందర్శించారు. అక్కడ ప్రదర్శించిన వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక యంత్ర పరికరాలు, పారిశ్రామిక ఉత్పత్తులను ఆసక్తిగా పరిశీలించారు. ఆయా ఉత్పత్తుల ప్రత్యేకతలు, వాటి వినియోగం, సాంకేతిక విధానాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక పరికరాల వినియోగం రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయనే అంశాలను పరిశీలించారు.

మేళాను సందర్శించాలని రైతులకు పిలుపు

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మెళకువలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అందుబాటులోకి వస్తున్న యంత్ర పరికరాలపై రైతులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులందరూ మెగా రైతుమేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, వ్యవసాయరంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, ఆధునిక పద్ధతులను తెలుసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శన రైతులకు విజ్ఞానాన్నిఅందించడంతో పాటు వ్యవ సాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు కొత్త ఆలోచనలు, అవకాశాలను పరిచయం చేసే వేదికగా నిలవనుంది.

ప్రముఖుల హాజరు

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, ఎంపీలు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ20 కాదు.. 420

మొదటి పేజీ తరువాయి...

పరీక్ష లు నిర్వహించగా, నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ ఉన్నట్లుగా వెల్లడైందని రాహుల్ గాంధీ తెలిపారు. 14 నమూనాలను పరీక్షిం చగా.. 11 నమూనాల్లో ఇథనాల్ శాతం 20 దాటినట్లు వెల్లడించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్)కు చెందిన నమూనాల్లో 31.2శాతం, హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) నమూనాల్లో 30.5శాతం ఇథనాల్ ఉన్నట్లు తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీఎల్, హెచ్‌పీ సీఎల్, బీపీసీఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థలైన నయారా, షెల్ విక్రయ కేంద్రాల నుంచి సేకరించిన నమూనాల్లోనూ 20 శాతానికి పైనే ఇథనాల్ ఉన్నట్లు ఆరోపించారు.

సూర్యాపేట రైల్వే లైన్ కోసం కొనసాగుతున్న నిరసనలు

సర్వోత్తమ్ రెడ్డి ప్రత్యేక చొరవ ప్రజల చిరకాల డిమాండ్‌కు మద్దతు..

ఎంపీ రఘువీర్ రెడ్డితో చర్చలు



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, నవంబర్ 7 (స్పెషల్ ఎడిషన్):

సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైల్వే లైన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో స్థానికంగా నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశం మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లా కేంద్రానికి రైల్వే సౌకర్యం కల్పించాలన్న ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చేందుకు నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ విషయాన్ని నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సూర్యాపేటకు రైల్వే లైన్ మంజూరు అంశంపై ప్రకటన చేయించారు. రైల్వే లైన్ కోసం ప్రజలు, వివిధ వర్గాలు నిరసనలు చేపడుతున్న తరుణంలో ప్రజల డిమాండ్‌కు రాజకీయ స్థాయిలో మద్దతు లభించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సూర్యాపేటకు రైల్వే మార్గం అందుబాటులోకి వస్తే జిల్లా ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు, పారిశ్రామిక అభివృద్ధికి కూడా దోహదపడుతుందని సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల చిరకాల స్వప్నమైన రైల్వే లైన్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం, రైల్వే శాఖలు సానుకూల నిర్ణయం తీసుకోవాలని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

సంపాదకీయం

స్వతంత్ర సంస్థలకు రాజకీయ క్రిమీడ

ప్రజాస్వామ్యానికి కాపలాదారులు గా ఉండాల్సిన రాజ్యాంగ సంస్థలు పాలకుల రాజకీయ పంజరంలో బందీలైతే ప్రజాస్వామ్యానికి సమాధి కట్టినట్టే! అధికారానికి ఊడిగం చేయడానికి కాదు సంస్థలున్నది.. రాజ్యాంగాన్ని కాపాడటానికే. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఎన్నికలు పెట్టడం, ఓట్లు లెక్కింపు, ఫలితాలు ప్రకటించడమే కాదు.. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించే వ్యవస్థలుగా ఉండాలి.పాలకుల నిర్ణయాలకు అడ్డుకట్ట వేయగల స్వతంత్రసంస్థలుగా ఉండాలి. అధికార దుర్వినియోగాన్ని నిలదీయగలగాలి. కానీ నేడు దేశంలో స్వతంత్ర సంస్థల స్వయంప్రతిపత్తిపై జరుగుతున్న చర్చలు ప్రజాస్వా మ్యానికి పెను హెచ్చరికగా మారుతున్నా యి. సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన చోట ప్రభుత్వ నీడలో నడుస్తున్నా యనే అనుమానాలు బలపడితే అది కేవలం ఒక సంస్థ ప్రతిష్ఠకు సంబంధించిన సమస్య కాదు. దేశ ప్రజాస్వామ్య పునాదులకే ప్రమాద ఘంటిక.రాజ్యాంగ సంస్థలు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఊడిగం చేయడానికి ఏర్పడిన కార్యాలయాలు కావు. ప్రభుత్వ నిర్ణ యాలకు గుడ్డిగా తలూపే ముద్ర వేసే యంత్రాలు అంతకంటే కావు. ప్రజల ప్ర యోజనాలను, రాజ్యాంగ విలువలను కా పాడాల్సిన బాధ్యత వాటిపై ఉంది. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా నిర్ణ యాలు తీసుకుంటేనే స్వతంత్ర సంస్థలుగా గుర్తింపు వస్తుందా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిజాన్ని చెప్పే ధైర్యం లేకపోతే ఆ సంస్థలకు స్వయంప్రతిపత్తి ఉన్నట్టా? పాలకులే జవాబు చెప్పాలి. స్వతంత్రత అనేది ప్రభుత్వానికిచ్చే కానుక కాదు. అది ప్రజాస్వామ్యం కల్పించిన రాజ్యాంగ బాధ్యత.పథకాలు చూడండి2016లో జరిగిన పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. సామాన్య ప్ర జలు బ్యాంకుల ముందు క్యూలో నిలబడ్డారు. చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపో యారు. పేదల జీవనాధారాలు దెబ్బతిన్నాయి. ఇంతటి కీలక నిర్ణయం విషయం లో రిజర్వ్ బ్యాంకు స్వతంత్రంగా వ్యవహరించిందా? ప్రభుత్వ నిర్ణయాన్ని లోతుగా పరిశీలించిందా? లేదా ముందే తీసుకున్న నిర్ణయానికి ఆమోదముద్ర వేసిందా? అనే ప్రశ్నలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు కాపలాదారుగా ఉండాల్సిన కేంద్ర బ్యాంకు ప్రభుత్వ నిర్ణయాల ముందు స్వతంత్రతను కోల్పోతే సామాన్యుడి ఆర్థిక భద్రతకు దిక్కెవరు? ప్రభుత్వా నికి నచ్చిన నిర్ణయమే సరైనదని చెప్పే సంస్థకు స్వతంత్ర సంస్థ అనే పేరెందుకు? ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనది ఓటు. ఆ హక్కును కాపాడాల్సిన ది ఎన్నికల సంఘం. అది ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండకూడదు. అధికార పార్టీకి ఒక కొలమానం, ప్రతిపక్షానికి మరో కొలమానం ఉంటే అది నిష్పక్షపాత అనిపించుకోదు. ఎన్నికల కోడ్ అందరికీ సమానంగా వర్తించాలి. అధికార బలం, ధనబలం, రాజకీయ పలుకుబడి ఎన్నికల ను ప్రభావితం చేయకుండా చూడాలి. ఈసీ నిర్ణయాలపై ప్రజల్లో అనుమానాలు పెరగడం అంటే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం సన్నగిల్లుతుంది. స్వతంత్ర సంస్థల స్వేచ్ఛను దెబ్బతీసే మొదటి అడుగు వాటి నియామకాల నుం చే మొదలవుతుంది. కీలక పదవుల్లో ఎవరిని నియమిస్తున్నారు?వారి అర్హత ఏంటి? వారి ఎంపికలో పారదర్శకత ఉందా? రా జకీయ విధేయతకు ప్రాధాన్యతనిస్తున్నా రా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా రావాలి. అధికార పార్టీకి అనుకూలమైన వ్యక్తులనే కీలక పదవుల్లో నియమిస్తే భవిష్యత్తులో ఆ సంస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటాయనే నమ్మకం ఎలా కలుగుతుం ది? అందుకే నియామక ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాల భాగస్వామ్యం, పారదర్శ కత, అర్హతలకు ప్రాధాన్యముండాలి. సం స్థల పునాదులనే రాజకీయ ప్రయోజనాలతో కలుషితం చేస్తే వాటి నుంచి నిష్ప క్ష పాతాన్ని ఆశించడం వగటికలే అవుతుంది.స్వయంప్రతిపత్తి అంటే ప్రశ్నించడానికి వీల్లేని అధికారం కాదు. ప్రభుత్వ జోక్యం ఉండకూడదన్న పేరుతో సంస్థలు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి వీల్లేదు. అధికార దుర్వినియోగం జరిగినా, నిర్ణయాల్లో తప్పులు దొర్లినా, ప్రజా ప్ర యోజనాలకు విరుద్ధంగా వ్యవహరించినా ప్రశ్నించే వ్యవస్థ ఉండాలి. ప్రజాస్వామ్య పర్యవేక్షణ, పార్లమెంటరీ సమీక్ష, న్యాయపరమైన పరిశీలనకు సంస్థలు జవాబు దారీగా ఉండాలి. కానీ ఈ పర్యవేక్షణ రాజకీయ కక్షసాధింపుకు ఆయుధంగా మార కూడదు. ప్రభుత్వ పెత్తనం ఒక ప్రమాదమైతే, జవాబుదారీతనం లేని స్వతంత్రత మరో ప్రమాదం. ఈ రెండింటి మధ్య రా జ్యాంగ సమతుల్యతే ప్రజాస్వామ్యానికి రక్షణ.దేశంలో అధికారాలు శాశ్వతం కావు. ప దవులు శాశ్వతం కావు. ప్రభుత్వాలు శాశ్వ తం కావు. కానీ రాజ్యాంగం శాశ్వత విలువలతో నిలబడాలి. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండవచ్చు. అందుకే తమకు అనుకూలంగా ఉన్నప్పుడు సంస్థల స్వతంత్రతను సమర్థిస్తూ, ప్రతికూల నిర్ణయాలు వచ్చినప్పుడు వా టిపై దాడి చేసే ద్వంద్వ వైఖరిని రాజకీయ పార్టీలు విడనాడాలి. ప్రజాస్వామ్యం అం టే పాలకుల ఇష్టమే చట్టం కాదు. ప్రజల హక్కులే దాని ప్రాణం. రాజ్యాంగ సంస్థలు పాలకుల కరతాళ ధ్వనులకు అనుగుణం గా పనిచేసే వేదికలుగా మారితే ప్రజాస్వా మ్యం కేవలం ఎన్నికల తంతుగా మిగిలిపోతుంది. రాజకీయాలు చూడండిఎన్నికల సంఘం కావచ్చు, రిజర్వ్ బ్యాంకు కావచ్చు, మరే ఇతర రాజ్యాంగ సంస్థ కావచ్చు.. వాటి విధేయత ప్రభుత్వాల పట్ల కాదు, రాజ్యాంగం పట్ల ఉండా లి. వాటి నిర్ణయాలకు ప్రాతిపదిక రాజకీ య ప్రయోజనాలు కాదు, ప్రజా ప్రయోజనాలు కావాలి. అధికారాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం పాలన కాదు. ప్రశ్నలకు సమాధానం చెప్పడం, విమర్శలను స్వీకరించడం, తప్పులను సరిదిద్దుకోవడమే ప్రజాస్వామ్య పరిపక్వత. సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చూసే పాలకులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. అధికారం ప్రజలు ఇచ్చేది.. రాజ్యాంగం పరిమితులు విధించేది! స్వతంత్ర సంస్థలను బలహీనపరిస్తే చివరకు బలహీనమయ్యేది పాలకులు కాదు.. ప్రజాస్వామ్యమే.

ఎల్‌నినో ఎఫెక్ట్.. రైతులు అప్రమత్తం!

మొదటి పేజీ తరువాయి...

ఆరుతడి పంటలనే సాగు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వచ్చే ఎనిమిది నెలలు రాష్ట్రానికి గడ్డుకాలంగా మారే అవకాశముందని, ఇప్పటి నుంచి వచ్చే జూలై వరకు వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే పరిస్థితులు లేవని పేర్కొన్నారు. పంటలు వేసే ముందు రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని, కష్టకాలంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే కరువు పరిస్థితులను ప్రభుత్వం, రైతులు, ప్రజలు సమష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను శనివారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని, ఒకప్పుడు ఇదే సమయానికి వందల టీఎంసీల నీటితో కళకళలాడే జలాశయాలు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

డిసెంబర్‌లో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు...

ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులు, కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు గోదావరి, కృష్ణా జలాల వినియోగంపై సమగ్రంగా చర్చించేందుకు డిసెంబర్‌లో రెండు మూడు రోజులపాటు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో నీటి లభ్యత, సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు. రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాస్తవ పరిస్థితులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగ అనంతరం ప్రజాబలం కార్యక్రమం చేపట్టి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని కష్టకాలంలో వారికి తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు.

ప్రాజెక్టులపై విమర్శలకు సీఎం వివరణ

గోదావరిలో నీళ్లు పారుతున్నా ప్రభుత్వం ఎత్తిపోసుకోవడం లేదంటూ కొందరు చేస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి స్పందించారు. పారే నీటిని ఎత్తిపోయడానికి బ్యారేజీలు ఎందుకని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కన్నెపల్లి పంపుహౌస్ పంపులు పనిచేయడం లేదని వివరించారు. మేడిగడ్డ గేట్లు మూసి 16 టీఎంసీల నీటిని నిల్వ చేసినప్పుడే ఎత్తిపోతలకు అవసరమైన నీరు పంపుహౌస్‌కు చేరుతుందని పేర్కొన్నారు. తుపాకులగూడెం వద్ద నీటిని నిల్వ చేసి దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోస్తున్నామని, దిగువన ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగించుకుంటున్నామని తెలిపారు. నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిధిలో ఒక్క ఎకరా ఆయకట్టు కూడా లేదని, ఆ మూడు బ్యారేజీలు ఏకకాలంలో పనిచేసినప్పుడే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీరు చేరుతుందని వివరించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. నీటి వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా రాజకీయ విమర్శలు చేయడం సరికాదని పరోక్షంగా వ్యాఖ్యానించారు.

పాలమూరు ప్రాజెక్టులపై ఆవేదన

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పాలమూరు జిల్లాలో తాగునీరు, సాగునీటి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు కూడా ఆశించిన స్థాయిలో రాలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలమూరు ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, సాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశించారని పేర్కొన్నారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాలు పూర్తయి పొలాలకు నీరందుతాయని ఆశించినప్పటికీ ఆశించిన పురోగతి కనిపించలేదని అన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తయి ఉంటే నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం లభించేదని చెప్పారు. అచ్చంపేట ఎత్తిపోతల, సీతారామసాగర్ వంటి ప్రాజెక్టులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి, చేవెళ్ల, వికారాబాద్, తాండూరు ప్రాంతాలకు నీటిని తరలించే లక్ష్యంతో పనులు చేపట్టారని, అప్పట్లో రూ. 15 వేల కోట్లు ఖర్చు చేశారని గుర్తుచేశారు.

కొడంగల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

ప్రజల ఆశీర్వాదం, దేవుడి కరుణ, అందరి సహకారంతో కొడంగల్‌కు గొప్ప అవకాశం దక్కిందని సీఎం అన్నారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైతులు నూటికి నూరు శాతం ముందుకొచ్చి భూములు ఇచ్చారని, ఎకరాకు రూ. 20 లక్షల పరిహారం చెల్లించి భూసేకరణ చేపట్టామని వెల్లడించారు. ఈ ప్రాంత రైతుల సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి లగచర్ల వరకు ఢిల్లీ-నోయిడా, ముంబై-పుణె తరహాలో భారీ పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి కొడంగల్ వరకు 250 అడుగుల వెడల్పుతో రహదారిని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయని, స్థానిక నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యా, పారిశ్రామిక హబ్‌గా కొడంగల్

ఒకప్పుడు గుర్తింపు కోసం తాపత్రయపడిన ప్రాంతం నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే స్థాయికి చేరుకుందని సీఎం అన్నారు. అయితే గుర్తింపు ఒక్కటే సరిపోదని, ఇక్కడి పొలాలకు నీరు రావాలని, పంటలు పండాలని ఆకాంక్షించారు. రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్)లో భాగంగా కొడంగల్‌ను సమగ్ర అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మెడికల్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, నర్సింగ్, వెటర్నరీ, లా కళాశాలలతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సైనిక్ స్కూల్ ఏర్పాటు ద్వారా విద్యా రంగంలోనూ ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తామని చెప్పారు. పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసి, స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొడంగల్‌ను రేర్ ఎడ్యుకేషన్ హబ్‌గా, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 10 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు. వ్యవసాయం, విద్య, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు సమాంతరంగా అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

వేసవి రాకముందే నీటిగండం



సిరిసిల్ల : వేసవి రాకముందే నీటిగండం భయపెడుతోంది. ఇప్పటికే ప్రభుత్వం నీటిని పొదుపుగా వాడుకోవాలని హెచ్చరించడమే కాకుండా జరిమానాలు వేస్తామని ప్రకటించింది. ఎల్‌నినో విపత్తు, పెరిగిన నీటి వినియోగం, ఉష్ణోగ్రతల ప్రభావంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూగర్భ జలాలు రోజుకు పడిపోతున్నాయి. సంవత్సరంతో పోలిస్తే జిల్లాలను బోరుబావులు, వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. జిల్లాలో సగటున 7.82 మీటర్ల లోతుకు జలాలు పడిపోయాయి. గత సంవత్సరం అక్టోబరులో సగటున 5.13 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉంటే ఈ సంవత్సరం అక్టోబరులో సగటున 7.82 మీటర్లకు తగ్గిపోయింది. జిల్లాలో అత్యధికంగా వేములవాడ అర్బన్ మండలంలో 15.39 మీటర్లకు భూగర్భ తగ్గిపోయాయి. సిరిసిల్లలో 14.08 మీటర్లు, వీర్నపల్లిలో 13.03 మీటర్లు, ఎల్లారెడ్డి పేటలో 10.91 మీటర్లు, ముస్తాబాద్‌లో 8.50 మీటర్లు, గంభీరావుపేట 8.39 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి. చాలా గ్రామాల్లో తగ్గిపోయి నీటి లభ్యత ప్రమాదకరంగానే కనిపిస్తోంది. మరోవైపు వర్షాలు లేక జిల్లాలోని చెరువుల్లోకి పూర్తిస్థాయిలో నీళ్లు చేరలేదు. ఎల్‌నీనో ప్రభావంతో ఉష్ణోగ్రతల్లో ఏర్పడ్డ మార్పులకు చెరువులు, బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. వానాకాలం సీజన్‌లో సగటు వర్షపాతం ఇప్పటివరకు 808.5 మిల్లీమీటర్లకు 757.5 మిల్లీమీటర్లు కురిసింది. సగటు 6.0 శాతం తక్కువగా ఉండగా, రుద్రంగిలో 32శాతం, చందుర్తిలో 20శాతం, వేములవాడలో 18శాతం, సిరిసిల్లలో 14శాతం, ఎల్లారెడ్డిపేటలో 17 శాతం, ముస్తాబాద్‌లో 13శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ పరిస్థితుల్లో అనుమతులు లేకుండా బోరుబావులు తవ్వకుండా ఆంక్షలు విధించారు. అయినప్పటికీ గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా బోరుబావుల తవ్వకం ఆగడం లేదు. మరోవైపు వేసవికి ముందే తాగునీటి కటకట కూడా వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం

ఎల్‌నినో ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. శీతాకాలంలోనూ ఉష్ణోగ్రతలు ఎండాకాలం తలపించడంతో చెరువులు, కుంటల్లో కూడా నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి. రోజురోజుకు పడిపోతున్న నీటి లభ్యత తగ్గిపోవడంతో చివరి దశలో ఖరీఫ్ సాగు ఆవేదన నింపింది. మరోవైపు కరెంటు కోతలతో పంటలకు నీళ్లు అందించలేక రైతులు ఆందోళన పడుతున్నారు. ఇప్పటికే వరి కోతలు జోరుగా సాగుతున్న దిగుబడిపై ప్రభావం చూపింది. ఎకరాల్లోనే వరి పంటకు నష్టం వాటిల్లడంతో రైతులకు ఆవేదన చెందుతున్నారు. ఒకవైపు ధర గిట్టుబాటుగా ఉన్న దిగుబడి లేక రైతులు దిగాలు పడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2.23 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, వరి 1.47 లక్ష ఎకరాలు సాగు చేశారు. ఇందులో 90వేల ఎకరాల వరకు సన్న రకం సాగు చేశారు. జిల్లాలో ఒకవైపు వరికోతలు జోరుగా సాగుతుండగా అదేస్థాయిలో కొనుగోలు కూడా జరుగుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే సగం వరకు కోతలు పూర్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం క్వింటాలకు రూ.2461, బీ గ్రేడ్ రూ.2441 ధర నిర్ణయించారు. సన్న రకాలకు రూ.2461 తోపాటు ప్రభుత్వం మరో రూ.500బోనస్ ఇస్తోంది.ప్రస్తుతం జిల్లాలో దొడ్డు రకం వడ్లు క్వింటాలు రూ.2500 వరకు కొనుగోలు చేస్తుండగా.. సన్నవడ్లు రూ.2800 నుంచి రూ.3వేల వరకు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం యాసంగిలో క్రాప్ హాలిడేగా ప్రకటిస్తారని ఊహిస్తున్న క్రమంలో ధాన్యం లభించే అవకాశాలు తక్కువ కానున్నాయని భావించి పచ్చి పచ్చి వడ్లు కొనుగోలు చేస్తున్నారు.

కోఆప్షన్ పదవుల భర్తీకి మోక్షమెప్పుడో?

పెద్దపల్లి : మున్సిపల్ ఎన్నికలు ముగిసి పదినెలలు కావస్తున్నా కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ మాత్రం ఇంకా కొలిక్కి రావడం లేదు. జిల్లాలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో ఈ పదవుల భర్తీ పెండింగ్‌లోనే ఉంది. ఒక్కోపట్టణ స్థానిక సంస్థలో నలుగురు చొప్పున మొత్తం 17మంది కోఆప్షన్ సభ్యులను నియమించాల్సి ఉంది. ఈ మేరకు మున్సిపల్ ఉన్నతాధికారుల నుంచి ఆయా మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు వచ్చి నెలలు గడుస్తున్నా ఎంపిక ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. స్థానిక ఎమ్మెల్యేలు పేర్లను ఖరారు చేయకపోవడంతో ఆశావహులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని నాలుగు పట్టణ స్థానికసంస్థల్లో మున్సిపల్ ఎన్నికల ద్వారా మొత్తం 126 మంది ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యారు. ఇందులో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 60 కార్పొరేటర్ స్థానాలు ఉండగా, పెద్దపల్లి మున్సిపాలిటీలో 36, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో 15 చొప్పున కౌన్సిలర్ స్థానాలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించగా, పాలకవర్గాలు కొలువుదీరాయి. అయితే కోఆప్షన్ సభ్యుల నియామకం మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. ఒక్కో పట్టణ స్థానిక సంస్థలో నలుగురు చొప్పున మొత్తం 16మందికి అవకాశం కల్పించాల్సి ఉంది.

ఒక్కో పదవికి పలువురి పోటీ..

కోఆప్షన్ సభ్యుల పదవులపై అధికారపార్టీకి చెందిన పలువురు నాయకులు ఆశలు పెట్టుకున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసి అవకాశం దక్కనివారు, పార్టీకోసం పనిచేసిన నాయకులు, స్థానికంగా గుర్తింపు ఉన్ననేతలు ఈ పదవులను ఆశిస్తున్నారు. తమకు అవకాశం కల్పించాలంటూ ఇప్పటికే ఆయానియోజకవర్గాల ఎమ్మెల్యేలను కలిసి విజ్ఞప్తులు చేశారు. ఎమ్మెల్యేలు సైతం ఆశావహుల పేర్లను సేకరించి పరిశీలించినట్లు తెలుస్తోంది. అయితే ఒక్కో పదవికి పలువురు పోటీపడుతుండ టంతో ఎవరికి అవకాశం కల్పించాలనే విషయంలో తుది నిర్ణయం తీసుకోవడం ఆలస్యమవుతోంది. ఒకరికి అవకాశం కల్పిస్తే మరొకరు అసంతృప్తికి గురయ్యే పరిస్థితి ఉండటంతో ఎంపిక విషయంలో ఎమ్మెల్యేలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కమిషనర్లకు ఆదేశాలొచ్చినా..

మున్సిపల్ ఎన్నికల నిర్వహణతోపాటు కోఆప్షన్ సభ్యుల నియామకానికి సంబంధించి మున్సిపల్ ఉన్నతాధికారుల నుంచి ఆయా మున్సిపల్ కమిషనర్లకు ఇప్పటికే ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యేల నుంచి తుది జాబితాలు ఖరారు కాకపోవడంతో నియామక ప్రక్రియ ముందుకు సాగడంలేదు. అధికారికంగా ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందనే దానిపై స్పష్టత లేక పోవడంతో పదవులు ఆశిస్తున్న వారు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

బియ్యం ధరలకు కళ్లెం పడేనా..?

జగిత్యాల : వర్షాభావ పరిస్థితులు ఇప్పటికే వ్యవసాయ రంగాన్ని కుదేలు చేయగా, దాని ప్రభావం సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పడుతోంది. వానాకాలంలో ఇప్పటికే వరి సాగు విస్తీర్ణం తగ్గగా యాసంగిలోనూ ఇదే పరిస్థితి కొనసాగనుంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా బియ్యం ధరలకు రెక్కలు వస్తున్నాయి. రెండు నెలల క్రితం ఉన్న ధరలకు ప్రస్తుతం విక్రయిస్తున్న ధరలకు పొంతన లేకుండా పోయింది. రోజురోజుకూ ధరలు ఆకాశన్నంటుతుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బియ్యం కొని తినలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వం ధరల కట్టడికి చర్యలు ప్రారంభించింది. అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు.

అధికారుల స్పెషల్ డ్రైవ్

ప్రభుత్వమే రకాలను బట్టి బియ్యం ధరలను నిర్ణయించింది. బీపీటీకి క్వింటల్‌కు రూ.6.400, హెచ్‌ఎంటీ, సోనారకం బియ్యానికి రూ.7.400, జైశ్రీరామ్ రూ.7.900గా ధర నిర్ణయించింది. రంగంలోకి దిగిన జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మిల్లర్లు, హోల్‌సెల్ వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తూ నిబంధనలను వివరిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను వివరిస్తూ పోస్టర్ సైతం అందజేశారు. ధరల పట్టికను షాపుల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు.

10 వేలకు చేరిన జైశ్రీరామ్...

గతంలో ఎన్నడూ లేనివిధంగా బియ్యం ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి.

రెండు నెలల క్రితం క్వింటాల్‌కు రూ.6000 నుంచి 6,500 లోపే ఉన్న జైశ్రీరామ్ బియ్యం ప్రస్తుతం రూ.10 వేలకు అమ్ముతున్నారు. రాను న్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. బియం ధరల పెరుగుదలకు ప్రభుత్వం కళ్లెం వేసే చర్యలు చేపట్టినప్పటికీ వ్యాపారుల వాదన అందుకు విరుద్ధంగా ఉంది. రైస్ మిల్లర్లు, హోల్‌సేల్‌గా అధిక ధరలకు విక్రయిస్తుంటే తాము మాత్రం



ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎలా విక్రయించాలని ప్రశ్నిస్తున్నారు. మిల్లుల వద్ద నిర్ణీత ధరలకు బియ్యం లభించనప్పుడు చిల్లర వ్యాపారులు తక్కువ ధరలకు విక్రయించడం ఎలా సాధ్యపడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో సీరియస్‌గా ముందుకు సాగుతోంది. నిర్ణయించిన ధర కంటే అధిక రేటుకు విక్రయిస్తే నిత్యావసర వస్తువుల చట్టం-1955 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తోంది.

శరవేగంగా కుంభమేళ పనులు



భోపాల్ : దేశంలో ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో కుంభమేళా జరుగుతుండగా.. నాసిక్ కుంభమేళాకు ప్రత్యేకత ఉంది. ఇది నాసిక్‌తో పాటు త్రయంబకేశ్వర్‌లోనూ నిర్వహిస్తారు. 1838లో త్రయంబకేశ్వర్‌లో శైవ, వైష్ణవ సాధువుల మధ్య స్నానాల ప్రాధాన్యత విషయంలో ఘర్షణలు జరగడంతో అఖాడాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. అప్పటి నుంచి శైవ సాధువులు త్రయంబకేశ్వర్‌లోని కుశావర్త తీర్థం వద్ద.. వైష్ణవ అఖాడాలు నాసిక్‌లోని రామ్‌కుండ్, తపోవన్ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించే సంప్రదాయం కొనసాగుతోంది.వచ్చే ఏడాది 3 ప్రధాన అమృత స్నానాలు జరగనున్నాయి. 2027 ఆగస్ట్ 2, ఆగస్ట్ 31, సెప్టెంబర్ 11వ తేదీల్లో జరగనున్నాయి. వీటితో పాటు నాసిక్‌లో 45, త్రయంబకేశ్వర్‌లో 29 శుభస్నాన తేదీల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2027 కుంభమేళా కోసం చేపట్టిన అభివృద్ధి పనులు కేవలం తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కావడం లేదు. మొత్తం 350కిపైగా ప్రాజెక్టులు చేపట్టగా.. వాటిలో దాదాపు 85 శాతం శాశ్వత మౌలిక సదుపాయాలుగా నిర్మిస్తున్నారు. కుంభమేళా ముగిసిన తర్వాత కూడా నాసిక్, త్రయంబకేశ్వర్ ప్రాంతాల ప్రజలకు ఇవి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించారు. కుంభమేళాతో పోలిస్తే ఈసారి మౌలిక సదుపాయాల కోసం పెట్టే వ్యయం దాదాపు 10 రెట్లు అధికమని కుంభమేళా మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు. 2027 వేడుకలను పరిశుభ్రంగా, సురక్షితంగా, సమర్థంగా నిర్వహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత కుంభమేళా ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రశాంతంగా ముగిసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను విస్తరించడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా దాదాపు 150 కిలోమీటర్ల మేర రహదారులను విస్తరించి, ఆధునీకీకరిస్తున్నారు. గోదావరి, దాని ఉపనదులపై కొత్తగా 8 వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుంభమేళా సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల రాకపోకలను సులభతరం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. ఇక నాసిక్ నగర ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపేలా 65.6 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.7,613 కోట్ల వ్యయం అంచనా వేశారు. రింగ్ రోడ్డు పూర్తి అయితే నగరంలోకి వచ్చే వాహనాల రద్దీ తగ్గడంతో పాటు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.కుంభమేళాలో పవిత్ర స్నానాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో నాసిక్‌లో గోదావరి నది వెంట సుమారు 3.4 కిలోమీటర్ల పొడవున కొత్త ఘాట్లను నిర్మిస్తున్నారు. త్రయంబకేశ్వర్‌లోనూ అదనపు స్నాన ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. చారిత్రక ఆలయాలు, కుండాలను పునరుద్ధరిస్తున్నారు. త్రయంబకేశ్వర్ ఆలయ పట్టణాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'శివ దర్శన్ పథ్' ప్రాజెక్టును చేపట్టారు. దీనివల్ల ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆ ప్రాంత పర్యాటక ప్రాధాన్యత కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.కోట్లాది మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే గోదావరి నది పరిశుభ్రత ఈ కుంభమేళాలో అత్యంత కీలకమైన అంశం. నదిలోకి శుద్ధి చేయని మురుగునీరు చేరకుండా అడ్డుకునేందుకు నాసిక్‌లో భారీ మురుగునీటి నిర్వహణ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో భాగంగా 4 ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు, దాదాపు 200 కిలోమీటర్ల పొడవున మురుగునీటి పైప్‌లైన్లు నిర్మిస్తున్నారు.

ఈ పనుల్లో సగానికిపైగా ఇప్పటికే పూర్తి అయ్యాయని నాసిక్ మున్సిపల్ కమిషనర్ మనీషా ఖాత్రీ తెలిపారు. కుంభమేళా ప్రారంభానికి ముందే మిగిలిన పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నాసిక్ నగరంలో మురుగునీటి నిర్వహణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు గోదావరి కాలుష్యాన్ని నియంత్రించేందుకు దోహదపడతాయి.మహారాష్ట్రలో ఈ ఏడాది బలహీనమైన రుతుపవనాల కారణంగా పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది, కోట్లాది మంది భక్తులకు అవసరమైన నీటిని అందించడం, స్థానిక ప్రజల అవసరాలను కూడా సమతుల్యం చేయడం అధికారులకు సవాలుగా మారనుంది. ముఖ్యంగా పుణ్యస్నానాల కోసం గోదావరిలో తగినంత నీటి లభ్యత ఉండేలా ముందస్తు ప్రణాళికలు అవసరం. భక్తుల అవసరాలు, నగరాల రోజువారీ నీటి అవసరాల మధ్య సమన్వయం సాధిస్తామని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు కుంభమేళా ముగిసిన తర్వాత కూడా కనీసం 30 ఏళ్లపాటు ఈ ప్రాంతానికి ఉపయోగపడతాయని నాసిక్-త్రయంబకేశ్వర్ కుంభమేళా అథారిటీ కమిషనర్ శేఖర్ సింగ్ వెల్లడించారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పర్యాటకం అభివృద్ధి చెందుతుందని, నాసిక్ అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా ఎదిగేందుకు ఈ ప్రాజెక్టులు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా 2027 సింహస్థ కుంభమేళా ఆధ్యాత్మిక వేడుకగానే కాకుండా.. ఉత్తర మహారాష్ట్రలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

ఓలా, ఉబెర్‌కు ధీటుగా విన్‌గ్రూప్


హైదరాబాద్ : తెలంగాణలో ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడంతోపాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా 2025 డిసెంబరు 9న తెలంగాణ ప్రభుత్వం, వియత్నాంకు చెందిన విన్‌గ్రూప్ మధ్య సుమారు 3 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్యాబ్ సేవలు, ఛార్జింగ్ కేంద్రాలు, స్మార్ట్ సిటీ అభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విన్‌గ్రూప్‌లో భాగమైన గ్రీన్ ఎస్ఎం ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలతో రవాణా సేవలను నిర్వహిస్తోంది. ఇప్పటికే 2026 జూన్ 5న ఢిల్లీ ఎన్సీఆర్‌లో వెయ్యి ఎలక్ట్రిక్ కార్లతో కార్యకలాపాలు ప్రారంభించింది. భవిష్యత్తులో వాహనాల సంఖ్యను 10 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌లోనూ ఈ సంస్థకు చెందిన కార్లు కనిపిస్తుండటంతో స్థానికంగా కార్యకలాపాల విస్తరణపై ఆసక్తి నెలకొంది. ఢిల్లీ ఎన్సీఆర్‌లో గ్రీన్ ఎస్ఎం క్యాబ్స్ కిలోమీటర్‌కు రూ.9 చొప్పున ఛార్జీ వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఓలా, ఉబెర్ వంటి సంస్థల్లో సాధారణంగా కిలోమీటర్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు ప్రయాణ ఛార్జీలు ఉంటున్నాయి. అయితే ట్రాఫిక్, ప్రయాణ దూరం, డిమాండ్, వాహనం రకాన్ని బట్టి ఈ ధరలు మారుతుంటాయి. ఈ సంస్థలు డ్రైవర్ల ఆదాయం నుంచి 20 నుంచి 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నాయి. మరోవైపు ర్యాపిడో క్యాబ్స్ రోజువారీ సబ్‌స్క్రిప్షన్, చిన్న పాస్‌ల విధానం ద్వారా జీరో కమిషన్ మోడల్‌ను కూడా అందిస్తోంది. ఉదాహరణకు రోజుకు రూ.3 వేల గ్రాస్ ఆదాయం వచ్చే క్యాబ్ డ్రైవర్ కంపెనీ కమిషన్ లేదా సబ్‌స్క్రిప్షన్ కింద రూ.100 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోంది. పెట్రోల్, సీఎన్‌జీ కోసం రూ.700 నుంచి రూ.900, నిర్వహణ, టోల్ ఛార్జీల కోసం మరో రూ.200 నుంచి రూ.300 ఖర్చవుతున్నాయి. ఇవన్నీ పోను రోజుకు రూ.1,200 నుంచి రూ.1,600 వరకు మాత్రమే డ్రైవర్‌కు మిగులుతున్నట్లు అంచనా. ఈ పరిస్థితుల్లో గ్రీన్ ఎస్ఎం తక్కువ ధరలకు క్యాబ్ సేవలు అందిస్తే ప్రయాణికులు అటువైపు మళ్లే అవకాశం ఉందని డ్రైవర్లు భావిస్తున్నారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ 2026 ఫిబ్రవరిలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 1.5 లక్షల మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి పనిచేస్తున్న వారు మరో 15 వేల మంది వరకు ఉన్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. కొత్త సంస్థ తక్కువ ఛార్జీలతో మార్కెట్‌లోకి వస్తే ఈ భారీ డ్రైవర్ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఓలా, ఉబెర్ డ్రైవర్లు తమకు అనుకూలమైన



సమయంలో యాప్‌లో లాగిన్, లాగౌట్ అయ్యే వెసులుబాటు కలిగి ఉన్నారు. కానీ గ్రీన్ ఎస్ఎం విధానంలో డ్రైవర్లను సంస్థ నేరుగా నియమించుకుని, కార్పొరేట్ ఉద్యోగుల తరహాలో నిర్ణీత పని గంటలు, సంస్థ నిబంధనల ప్రకారం పనిచేయించనున్నట్లు తెలుస్తోంది.ఢిల్లీలో సంస్థ కార్యకలాపాల తరహాలో హైదరాబాద్‌లోనూ తొలి విడతలో వెయ్యి కార్లను ప్రవేశపెడితే ఒక్కో వాహనానికి ఒకటి లేదా రెండు షిఫ్టుల చొప్పున సుమారు వెయ్యి నుంచి 2 వేల మంది డ్రైవర్లు అవసరమవుతారని అంచనా. సంస్థ సొంతంగా డ్రైవర్లను నియమించుకునే విధానం అనుసరించనుంది. ఢిల్లీ కార్యకలాపాలకు సంబంధించి రోజుకు 12 గంటలు పనిచేస్తే నెలకు రూ.35 వేల జీతం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఆదాయాన్ని పొందేందుకు డ్రైవర్లకు కఠినమైన నిబంధనలు విధిస్తున్నట్లు సమాచారం. కేటాయించిన రైడ్లలో కనీసం 90 శాతం అంగీకరించి పూర్తి చేయాలి. కస్టమర్ల నుంచి 4.8 రేటింగ్ సాధించాలి. బుక్ చేసిన ప్రయాణాన్ని మధ్యలో రద్దు చేయడానికి వీల్లేదు. ఢిల్లీలోని కొందరు డ్రైవర్లు ఈ నిబంధనలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీ, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, 10 నుంచి 12 గంటల పాటు నిరంతరంగా డ్రైవింగ్ చేయడం వల్ల అలసటకు గురవుతున్నామని చెబుతున్నారు. ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులో లేక సమయం వృథా అవుతోందని, ఆదాయ హామీ, చెల్లింపుల విషయంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

నాగార్జునసాగర్ వరదకాల్వలో విష రసాయనాలు..?

నల్గొండ : నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలోని నాగార్జునసాగర్ వరదకాల్వ లో నీరు రంగు మారడం, జలచరాలు చనిపోయి తేలడంతో స్థానికులు ఆందో ళనకు గురయ్యా రు. తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంకర్లతో రసాయనాలు పారబోసినట్లు అనుమాని స్తున్నారు. ఈ కాల్వ ద్వారా జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగు, సాగునీరు అందుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు కాల్వను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్యాంకర్లను గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. రసాయనాల స్వరూపం, నీటిపై వాటి ప్రభావం ఇంకా తెలియాల్సి ఉంది.నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలో నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు అకస్మాత్తుగా రంగు మారడం స్థానికంగా కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున ట్యాంకర్ల ద్వారా కాల్వలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం



చేశారు. రసాయనాలు కలవడంతో కాల్వలోని నీటి రంగు మారడమే కాకుండా.. జలచరాలు చనిపోయి నీటిపై తేలడంతో పరిస్థితి తీవ్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాగునీరు, సాగునీటి అవసరాలకు ఉపయోగించే కాల్వలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రజల్లో భయాందోళనలకు కారణమైంది. నాగార్జునసాగర్ వరదకాల్వ ద్వారా నల్గొండ జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగునీరు, సాగునీరు అందుతోంది. ఇలాంటి కీలకమైన నీటి వనరులో గుర్తుతెలియని రసాయనాలు కలవడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. కాల్వ నీటిపై ఆధారపడే ప్రజలు, రైతుల అవసరాల దృష్ట్యా ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నీటి నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, కాల్వలో కలిసిన రసాయనాలు ఏంటి, వాటి ప్రభావం ఎంతవరకు ఉంటుందనే అంశాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని కాల్వ పరిసరాలను పరిశీలించారు. దాదాపు అర కిలోమీటరు మేర కాల్వను పర్యవేక్షించారు. కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారికి సమీపంలోని కొత్తగూడెం ప్రాంతంలో, కాల్వకు సుమారు 15 మీటర్ల దూరంలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించినట్లు నీటిపారుదల శాఖ ఏఈ మల్లయ్య తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు.. కాల్వలో రసాయనాలు పారబోసిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. వరదకాల్వ వెంట గస్తీని పెంచడంతోపాటు, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి ట్యాంకర్లను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పెద్దవూర ఎస్సై గోపాల్‌రావు తెలిపారు. రసాయనాలను ఎవరు, ఎందుకు పారబోశారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. తాగు, సాగునీటికి ఉపయోగించే జలవనరుల్లో రసాయన వ్యర్థాలను పారబోయడం ప్రజారోగ్యంతోపాటు పర్యావరణానికి కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.ఘటనకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నీటి వనరుల పరిసరాల్లో పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేస్తామని చెబుతున్నారు.

ఏపీకి- ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలి..

కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు పి.వి.ఎన్. మాధవ్ లేఖ!

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వరుసగా ముంచెత్తిన తీవ్ర తుపాన్ల కారణంగా దెబ్బతిన్న రైతాంగాన్ని, గ్రామీణ ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక ఆర్థిక సహాయ ప్యాకేజీని ప్రకటించాలని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ చివరి వారంలో విరుచుకుపడిన ఆర్నబ్,తాజాగా నవంబర్ ప్రారంభంలో వినాశనం సృష్టించిన మురాసు తుపాన్ల ధాటికి రాష్ట్రంలోని వ్యవసాయం, ఉద్యానవనం, ఆక్వాకల్చర్, మత్స్య, పశుసంవర్ధక రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొంటూ ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సమగ్ర లేఖ రాశారు. ఈ వరుస ప్రకృతివిపత్తులవల్ల వేలాది మంది రైతులు, కూలీలు, మత్స్యకారులు తమ జీవనోపాధిని కోల్పోయి వీధిన పడ్డారని మాధవ్ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్నబ్ తుపాను తదనంతర నష్టాలను అంచనా వేయడానికి తక్షణమే కేంద్ర అధ్యయన బృందాలను పంపించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, హోంమంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన.. తాజాగా సంభవించిన మురాసు తుపాను నష్టాన్ని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వెంటనే మరొక కేంద్ర బృందాన్ని పంపించాలని కోరారు. రెండు తుపాన్ల వల్ల వాటిల్లిన ఉమ్మడి నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌కు భారీ కేంద్ర సహాయాన్ని అందించాలని స్పష్టం చేశారు.బాధిత రైతులకు తక్షణ నివారణ చర్యలతో పాటు, వ్యవసాయ పెట్టుబడి రాయితీలను త్వరితగతిన విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద దెబ్బతిన్న పంటలకు నష్టపరిహార ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. ఉద్యానవనాలు, ఆక్వాకల్చర్, పాడి పరిశ్రమలకు కూడా ప్రత్యేక పునరావాస సహాయం అందించడం ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మళ్లీ కోలుకుంటుందని అభిప్రాయపడ్డారు. పంటల నష్టమే కాకుండా, తుపాన్ల తాకిడికి వర్షాల వల్ల ధ్వంసమైన మౌలిక వసతుల పునరుద్ధరణపై కేంద్రం దృష్టి సారించాలని మాధవ్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు, విద్యుత్ వ్యవస్థలు , తాగునీటి సరఫరా మార్గాలను పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని లేఖలో విన్నవించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సకాలంలో స్పందించి ఏపీకి అండగా నిలుస్తుందనే నమ్మకం తమకు ఉందన్నారు. దెబ్బతిన్న కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించి, అన్నదాతల జీవితాల్లో తిరిగి ఆశల వెలుగులు నింపేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయ ప్యాకేజీని త్వరలోనే ప్రకటిస్తుందని ఆశిస్తున్నట్లు పి.వి.ఎన్. మాధవ్ వెల్లడించారు.

తిరుమల లడ్డూ కేసు... విచారణ ఏపీలోనే!

తిరుపతి : కోట్లాదిమంది వెంకటేశ్వర స్వామి భక్తుల విశ్వాసాలతో ముడిపడి ఉన్న తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు విచారణను ఏపీ వెలుపలకు మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసు విచారణను ఏపీ వెలుపల వేరే రాష్ట్రానికి మార్చాల్సిన అవసరం లేదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు, కేసు విచారణను ఏపీలోనే కొనసాగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విచారణ పారదర్శకంగా జరగాలన్న ఉద్దేశంతోనే సుప్రీంకోర్టు గతంలో సిట్ ఏర్పాటుకు ఆదేశించిన విషయం తెలిసిందే.తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందనే ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. దీనిపై పలువురు నేతలు, భక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, ఏపీలో విచారణ నిష్పాక్షికంగా జరగకపోవచ్చనే అనుమానంతో కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తాజాగా పరిశీలించి, తిరస్కరించింది. ఏపీలోనే న్యాయ ప్రక్రియ కొనసాగుతుందని తేల్చిచెప్పడంతో ఈ అంశంలో కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి నెయ్యి కల్తీ వినియోగంపై ఈడీ కీలక చర్యలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నిందితులు, వారి కుటుంబ సభ్యులు, సంస్థలకు చెందిన రూ.129.85 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసింది. ఈడీ హైదరాబాద్ జోనల్ ఆఫీసు ఈ చర్యలు చేపట్టింది. అటాచ్‌మెంట్‌తో కలిపి ఈ కేసులో ఇప్పటివరకు జప్తు లేదా ఫ్రీజ్ చేసిన ఆస్తుల విలువ రూ.132.55 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. ఈడీ చర్యల్లో భాగంగా భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ లకు చెందిన ఆస్తులను అటాచ్ చేసినట్లు సమాచారం. తంలోనే ఈ వ్యవహారంపై తాము ఆదేశాలు ఇచ్చి సంబంధిత వ్యక్తుల వ్యాఖ్యలను కంట్రోల్ చేసినట్లు పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. అయితే ఈ తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసులో సాక్షులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారని.. ఇప్పుడు ఈ కేసు విచారణను మరో రాష్ట్రానికి మార్చడం వల్ల వారికి ఇబ్బందులు కలగవచ్చని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. అంతేకాకుండా ఈ కేసు దర్యాప్తు తమ ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా జరిగిందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో కేసును మరో రాష్ట్రానికి బదిలీ చేయడానికి తగిన కారణాలు లేవని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలతో 2024లో ఈ వివాదం మొదలైంది. దీనిపై రాజకీయంగా తీవ్ర దుమారం చెలరేగడంతో.. దర్యాప్తును స్వతంత్ర సంస్థతో చేయించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలు అయ్యాయి. దీంతో 2024 అక్టోబర్ 4వ తేదీన అత్యున్నత న్యాయస్థానం ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర సిట్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో సీబీఐకి చెందిన ఇద్దరు అధికారులు, ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు చెందిన ఇద్దరు అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒక సీనియర్ అధికారి ఉన్నారు. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ బృందం దర్యాప్తు చేపట్టాలని కోర్టు ఆదేశించింది. తాజా నిర్ణయంతో కేసు విచారణను ఏపీ నుంచి బయటకు మార్చాలన్న నిందితుడి ప్రయత్నానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. విచారణ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతున్న విధంగానే ఆంధ్రప్రదేశ్‌లో ముందుకు సాగనుంది.సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన స్థిర, చర ఆస్తులను కూడా ఈడీ అటాచ్ చేసింది.

రైతుల నోట్లో మట్టి కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం..

వెయ్యి టీఎంసీల నీటిని సముద్రం పాలు చేసిన ఘనత రేవంత్ రెడ్డిది!

క్రాప్ హాలిడే ప్రకటిస్తే రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి : ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

కమలాపూర్ : మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యంలో తరుగు పేరుతో అధికంగా కోతలు విధించకుండా, నిబంధనల ప్రకారం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. రైతులను కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలంతో పాటు ఐదు మండలాలు, రెండు పట్టణాల్లో రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీళ్ల లేక పదెకరాలు ఉన్న రైతులు ఐదెకరాలు, నాలుగెకరాలు మాత్రమే సాగు చేస్తున్నారు. ఐదెకరాలు ఉన్న రైతులు రెండు ఎకరాలు, ఎకరం మాత్రమే సాగు చేసుకునే దుస్థితి ఏర్పడింది. రైతులు పంటలు వేసుకోలేని పరిస్థితి రావడం అత్యంత బాధాకరం. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 25 వేల క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నా కాళేశ్వరం నీటిని ఎందుకు ఎత్తడం లేదని ప్రశ్నిస్తున్నాం. ఈ లెక్కలు నా సొంతంగా చెబుతున్నవి కావు. కేంద్ర జల సంఘం గణాంకాల ప్రకారం ఇప్పటికీ ఆన్‌లైన్‌లో 25 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం కనిపిస్తోంది. ఆ నీటిని లిఫ్ట్ చేసి ఉంటే హుజురాబాద్ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందేదని అన్నారు. గతంలో కేటీఆర్ తో కలిసి వేలాది మంది రైతులతో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి లక్ష క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే నీటిని లిఫ్ట్ చేసి రైతులకు అందించాలని కోరాం. అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా నీటిని సముద్రం పాలు చేసింది. గోదావరి నుంచి సుమారు 750 టీఎంసీలు, కృష్ణా నుంచి 250 టీఎంసీల నీటిని వినియోగించుకోకుండా సముద్రం పాలు చేసిన ఈ ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనిపించడం లేదా?

కేసీఆర్ పాలనకు.. కాంగ్రెస్ పాలనకు తేడా రైతులకు స్పష్టంగా కనిపిస్తోంది. కేసీఆర్ గారు పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరోజైనా రైతులకు సాగునీటి సమస్య వచ్చిందా? 24 గంటల ఉచిత విద్యుత్ అందకుండా పోయిందా? రైతుబంధు అందని సీజన్ ఉందా? దురదృష్టవశాత్తూ రైతు చనిపోతే ఆ కుటుంబానికి రైతుబీమా కింద రూ.5 లక్షలు అందకుండా పోయాయా? రైతులు ఒక్కసారి గుండె మీద చేయి వేసుకొని ఆలోచించాలి.

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పుష్కలంగా నీళ్లు వచ్చాయి. 24 గంటల కరెంటు వచ్చింది. రైతుబంధు, రైతుబీమా అందాయి. మరి కేసీఆర్ గారు అధికారంలో నుంచి దిగిపోయిన తర్వాతే నీళ్ల సమస్యలు, కరెంటు కోతలు, యూరియా, డీఏపీ కొరతలు ఎందుకు వస్తున్నాయి?

ఏ పంట పండించినా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ బోనస్ ఏమైంది? రైతులకు ఇచ్చిన హామీలన్నీ బోగస్ మాటలుగానే మిగిలిపోయాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ క్రాప్ హాలిడే ప్రకటించడం ఏంటి? రైతులు పంటలు పండించకుండా చేసే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారు? కాళేశ్వరం ప్రాజెక్టుకు రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తే సామర్థ్యం ఉంది. ఇప్పటికీ సమయం మించిపోలేదు. ఈ క్షణం కూడా నీటిని లిఫ్ట్ చేసి రైతులకు అందిస్తే రైతులు మళ్లీ పంటలు వేసుకునే అవకాశం ఉంది.దయచేసి రాజకీయాలు చేయకండి. రైతుల జీవితాలతో చెలగాటం ఆడకండి.

ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని సాగునీటిని అందించాలి. హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్, ఇల్లంతకుంట, జమ్మికుంట, వీణవంక, హుజురాబాద్ మండలాలతో పాటు హుజురాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రైతులకు వెంటనే సాగునీరు అందించాలి. క్రాప్ హాలిడే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. ఒకవేళ క్రాప్ హాలిడే ప్రకటిస్తే నష్టపోయే ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు. రైతుల పక్షాన, రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు.

స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక

ఆదివారం, నవంబర్ 8, 2026

కాంపాడులో పోలీసులు ఆకస్మిక తనిఖీలు

సి. బెళగల్ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సి. బెళగల్ మండలం కాంపాడు గ్రామంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సి. బెళగల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వేను గోపాల్ రాజు తన సిబ్బందితో కలిసి కురువ జానకిరాముడు నివాసంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంట్లో రూ. 2 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ నగదును తదుపరి పరిశీలన, చట్టపరమైన చర్యల నిమిత్తం ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ జరగకుండా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అనుమానాస్పద వ్యక్తులు, నగదు తరలింపులు, అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఓటర్లను నగదు లేదా ఇతర ప్రలోభాలకు గురిచేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని, ఎన్నికల సమయంలో అనుమానాస్పద నగదు పంపిణీ లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

రాతన సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

- బొలెరో ఢీకొని పెరవలి వాసి అక్కడికక్కడే మృతి

తుగ్గలి : తుగ్గలి మండల పరిధిలోని గల రాతన ఆశ్రమ పాఠశాల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పెరవలి గ్రామానికి చెందిన గొల్ల సుంకన్న (35) సన్నాఫ్ జర్రప్ప అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై ఆదోని నుండి పెరవలి గ్రామానికి తిరిగి వస్తుండగా రాతన ఆశ్రమ పాఠశాల సమీపంలో కొలిమిగుండ్ల నుండి రాతన గ్రామానికి వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుంకన్న అక్కడికక్కడే మృతి చెందినట్లు తుగ్గలి ఎస్సై బాల నరసింహులు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రంగాపురంలో మద్యం దుకాణం తొలగించాలని మహిళల ఆందోళన

బేతంచెర్ల: బేతంచెర్ల మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో మహిళలు ఆందోళనకు దిగారు. గ్రామంలో పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని మహిళలు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రహదారిలో ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లే మార్గంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరికాదని నిరసన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని,వెంటనే తొలగించాలని దుకాణం ఏర్పాటు చేస్తున్న వ్యాపారికి గ్రామ ప్రజలు తమ అభ్యంతరాన్ని తెలియజేశారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు.

బండి కరీంనగర్ మహా పాదయాత్ర కు నేనే వస్తా

హైదరాబాద్ : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ న్యూఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్,ఇండీ కూటమి చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొడుతూ సర్ విషయంలో వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు కరీంనగర్ లో చేపడుతున్న మహా పాదయాత్ర కు తానే స్వయంగా వస్తానని ఈ సందర్భంగా బండిసంజయ్‌కు నితిన్‌నబీ చెప్పారు. వాస్తవానికి ఈనెల 5నకరీంనగర్ రావాల్సి ఉన్నప్పటికీ, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున రాలేకపోయానన్నారు. ఈసారి 'ఛట్ పూజ' అనంతరం తప్పకుండా కరీంనగర్ వచ్చి మహా పాదయాత్రలో పాల్గొంటానని చెప్పారు. కరీంనగర్ లో కాషాయ శ్రేణుల జోష్ ను చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా నితిన్ నబిన్ బండి సంజయ్ తో చర్చించారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్

చొప్పదండి : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోళు కేంద్రాల్లోనే ధాన్యం మద్దతు ధర పొందాలని గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్ అన్నారు. చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు గంగాధర సింగిల్ విండో ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కోట్లనరసింహులపల్లి, కొండాయపల్లి, చర్లపల్లి(ఎన్), ఇస్లాంపూర్, మంగపేట, మధురానగర్ ప్యాక్స్ సెంటర్లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తప్పు,తాలు లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు పొందాలని సూచించారు. సింగిల్ విండో డైరెక్ట్ బెజ్జంకి కళ్యాణ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుబ్బాసి బుచ్చన్న,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, గునుకొండ బాబు,సర్పంచ్ లు గునుకొండ యశోద,పడాల భాగ్యలక్ష్మి రాజన్న,రేండ్ల శ్రీనివాస్,రాచమల్ల రవి,మల్యాల తిరుపతి,బారాజు ప్రభాకర్ రెడ్డి,లింగాల లింగయ్య,వేముల భాస్కర్, ఎడవెల్లి విజయ, కాంగ్రెస్ నాయకులు సాగి అజయ్ రావు,రాచమల్ల భాస్కర్,గుజ్జుల బాపు రెడ్డి, ఎడవెల్లి శశిధర్ రెడ్డి, అత్తపురం తిరుపతి,కదారి కుమారస్వామి,వేముల అంజి,,రేండ్ల రాజి రెడ్డి,వంగల శ్రీధర్,పెంచాల చందు,గంగాధర శ్రీకాంత్,ముచ్చె శంకరయ్య కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు..

మిల్లులు కేటాయించకుండా మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చొప్పదండి : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని నష్టపోతుంటే ప్రభుత్వం మిల్లులు కేటాయించకుండా ఎమ్మెల్యే మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులను మోసం చేస్తున్నాడని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మెచినేని నవీన్ రావు అన్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు కానీ తూకం వేయడం ఎప్పటి నుండి ప్రారంభిస్తారో చెప్పాలన్నారు. ఇప్పటి వరకూ మిల్లులు కేటాయించకుండా కేంద్రాలను ప్రారంభం చేస్తే ఏమి ప్రయోజనం అని అన్నారు రైతులకు ప్రభుత్వం మీద నమ్మకం లేక ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలలో వెంటనే దాన్యాన్ని తూకం వేయడం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వేముల దామోదర్.రామిడి సురేందర్.జోగు సాగర్. మడ్లపెల్లి గంగాధర్.ఎండి నజీర్ హుస్సేన్.శ్రీమల్ల మెగరాజ్.వడ్లూరి ఆదిమల్లు.బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి.ముక్కెర మల్లేశం.పొట్టల కనుకయ్య. మామిడి అఖిల్.తదితరులు పాల్గొన్నారు

రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

కమాన్ పూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది అని బి ఆర్ ఎస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటికొండ శంకర్ అన్నారు. గురువారం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఎంపీడీవో మరియు తహసిల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. కమాన్ పూర్ మండల పరిధిలో వరి పంటలు కోతల సమయం వచ్చినప్పటికి దాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గురువారం బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా ప్రభుత్వ మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని త్వరితగతిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల విక్రయ ఇబ్బందులు తొలగించాలని కోరుతూ.. తహసీల్దార్ వాసంతికీ, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. మండలంలో వరి కోతలు జరుగుతున్నప్పటికి కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దాన్యం విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు.

భాగ్యనగర్‌లో నీటి కష్టాలు



హైదరాబాద్ : హైదరాబాద్‌లో నీటి సరఫరా సమస్య పలు రంగాలను ప్రభావితం చేస్తోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్ కారణంగా నగరంలోని హాస్టళ్లకు నీరు అందక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే హాస్టళ్లను మూసివేస్తామని యజమానులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరతతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు, స్థానికుల ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ నీటి సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నోటీసులు వెలువడుతున్నాయి. నీటి వనరులను కాపాడుతూనే ప్రజలకు ప్రత్యామ్నాయ సరఫరా కల్పించాలనే డిమాండ్ పెరుగుతోంది. హైదరాబాద్‌లో నీటి కొరత రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్న ఆందోళన వ్యక్తం అవుతుండగానే.. మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిణామం హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. నీరు అందుబాటులో లేక విద్యార్థులు, ఉద్యోగులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమీర్‌పేట్‌లోని ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో యజమానులు ఆందోళనకు దిగారు. ఎస్ఆర్ నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లిన అమీర్‌పేట్ వెల్ఫేర్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజా రావు, ఇతర సభ్యులు జనరల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గత 2 రోజులుగా నీరు అందక హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రైవేట్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని హాస్టల్ యజమానులు పేర్కొన్నారు. అధికారులను సంప్రదించినా హైడ్రా ఆదేశాల నేపథ్యంలో తామేమీ చేయలేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గురువారం నుంచి హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. అవసరమైతే నగరవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారునీటి కొరత ప్రభావం కార్పొరేట్ విద్యాసంస్థలపైనా పడుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకునే కాలేజీలకు రోజూ భారీగా నీరు అవసరం అవుతుంది. తాగునీటితో పాటు స్నానాలు, వంట, ఇతర అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే ప్రయత్నాలు చేసినా అవసరాలకు తగినంత సరఫరా లభించడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను తాత్కాలికంగా ఇళ్లకు పంపించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో కళకళలాడే కొన్ని కాలేజీ క్యాంపస్‌లు, హాస్టళ్లు ఖాళీ అవుతున్నాయి. నీటి సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో, విద్యాసంస్థలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన బంద్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెవెన్యూ, హైడ్రా అధికారులు తమ బోర్లపై చర్యలు తీసుకుంటున్నారని.. ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బోర్లు తొలగించడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ట్యాంకర్ల యజమానులు ఆరోపణలు చేస్తున్నారు. బంద్‌లో భాగంగా రోడ్లపైకి వచ్చిన కొన్ని ట్యాంకర్లను అడ్డుకోవడంతో పాటు.. ట్యాంకర్లలోని నీటిని రోడ్లపైనే పారబోసి నిరసన తెలపడంతో.. నీటి కొరత వేళ.. ట్యాంకర్ నీళ్లను వృథా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాఫీ షాపీల్లోనూ ఆఫీసు వర్క్

బెంగళూరు : కాఫీ షాపులను కొందరు తాత్కాలిక ఆఫీసులుగా మార్చుకుంటున్నారు. కస్టమర్లకు ఇది సౌకర్యంగా ఉన్నా కేఫ్ యజమానులకు తలనొప్పిగా మారుతోంది. బెంగళూరులో ఓ కేఫ్ యజమాని ఎదుర్కొంటున్న సమస్య ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కేవలం రూ. 150 కాఫీ ఆర్డర్ చేసి, గంటల తరబడి టేబుళ్లను ఆక్రమించుకుంటున్న కస్టమర్ల వల్ల వ్యాపారం దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారుబెంగళూరులోని ఇందిరానగర్‌లో ఓ వ్యక్తి రూ 60 నుంచి 70 లక్షలు పెట్టుబడి పెట్టి కెఫె ప్రారంభించారు. వ్యాపారం ప్రారంభించిన కొద్ది రోజులకే ఓ సమస్య ఎదురైంది. అక్కడికి వచ్చే కస్టమర్లు కేవలం రూ. 150 విలువైన ఒక కప్పు కాఫీ మాత్రమే ఆర్డర్ చేస్తున్నారు. ఆ తర్వాత ల్యాప్‌టాప్‌లు తెరిచి గంటల తరబడి అక్కడే కూర్చుంటున్నారు. కొన్నిసార్లు రోజంతా కూడా టేబుళ్లను ఆక్రమించుకుంటున్నారు. కేఫ్‌లోని టేబుళ్లన్నీ ఇలా గంటల తరబడి కస్టమర్లతో నిండిపోవడంతో కొత్తగా వచ్చే వారికి కూర్చోవడానికి స్థలం ఉండటం లేదు. దీంతో చాలా మంది కెఫెలోకి వచ్చి సీట్లు ఖాళీగా లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. ఒకవైపు కాఫీ ఆర్డర్ చేసిన కస్టమర్లను వెళ్లిపోవాలని చెప్పలేరు. అలా చెబితే వారు గూగుల్‌లో నెగెటివ్ రివ్యూ ఇచ్చే అవకాశం ఉంది. దానివల్ల కెఫెకు నష్టం కలుగుతుందని యజమాని ఆందోళన చెందుతున్నారు. ప్రముఖ కాఫీ చైన్లు స్టార్‌బక్స్, అఅఅ, థర్డ్ వేవ్ లో కాఫీ, స్నాక్స్ ధరలు ఎక్కువగా ఉంటాయి. కస్టమర్లు కేవలం కాఫీ, స్నాక్స్ కోసమే డబ్బులు చెల్లించడం లేదు అక్కడ కూర్చుని గంటల తరబడి గడిపే సమయానికి పరోక్షంగా చెల్లిస్తున్నారు. కెఫెలో కూర్చునే స్థలానికీ ఓ ధర ఉంటుంది. ఈ పోస్టు వైరల్ కావడంతో నెటిజన్లు రకరకాల సూచనలు చేస్తున్నారు. కెఫెలో ఎంతసేపు ఉంటే అన్ని గంటలకు కనీసం ఒక కాఫీ ఆర్డర్ చేయాలనే నిబంధన పెట్టాలని ఓ నెటిజన్ సూచించారు.

కాఫీ అమ్మడం కంటే కెఫెలో గడిపే సమయానికి డబ్బులు వసూలు చేసే విధానాన్ని తీసుకురావాలి. ఎక్కువ ధర చెల్లిస్తే మెరుగైన సీటింగ్, కాఫీ, స్నాక్స్ అందించవచ్చు అని మరికొందరు అన్నారు. కొన్ని కేఫెలలో ల్యాప్‌టాప్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. కస్టమర్లు చేసే ఖర్చును బట్టి కెఫెలో ఉండే సమయాన్ని నిర్ణయించాలి. రూ. 150 నుంచి రూ. 750 వరకు బిల్లు ఉంటే గరిష్ఠంగా గంటన్నర, రూ. 750 నుంచి రూ 1,500 వరకు బిల్లు ఉంటే రెండు గంటల సమయం ఇవ్వొచ్చు. వారంలో ఉదయం వేళల్లో ల్యాప్‌టాప్‌లతో పని చేసేందుకు అనుమతించి, సాయంత్రాలు, వారాంతాల్లో మాత్రం ఆంక్షలు విధించాలని మరో నెటిజన్ సూచించారు.

ఐరన్ స్పాంజ్ పరిశ్రమను వెంటనే మూసి వేయించాలి

బషీర్ బాగ్ : తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతూ కాలుష్యాన్ని వెదజల్లే ఐరన్ స్పాంజ్ పరిశ్రమను వెంటనే మూసియేయించండి. తమ పంట పొలాలను తాగు నీరును కలుషితం చేస్తూ.. తమ పాడి పశువుల చావుకు.. తమ అనారోగ్యాలకు కారణమవుతున్న ఓం శివ శక్తి కేడియా ఐరన్ స్పాంజ్ పరిశ్రమ వెదజల్లే కాలుష్యం నుండి తమను కాపాడాలంటూ ఆ గ్రామస్తులు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కందివనం మరియు మొగలిగిద్ద గ్రామ శివార్లలో గల ఓం శివ శక్తి కేడియా ఐరన్ స్పాంజ్ పరిశ్రమ నుండి వెలుబడుతున్న కాలుష్యం కారణంగా తమ పచ్చని పంట పొలాలు మరియు తాగునీరు కలుషితమవడమే కాకుండా.. ఆ పరిశ్రమ వదిలే కాలుష్యపు నీరు చుట్టుపక్కల గల చెరువులలో వెళ్లి కలవడం వల్ల తాగునీరు కలుషితమై తాము అనారోగ్యాల పాలవుతున్నామని.. తమ పాడిపశులు మృత్యువాత పడుతున్నాయని.. ఆ పరిశ్రమ చుట్టుపక్కల గల గ్రామస్తులందరూ పరిశ్రమ ముందు టెంట్ వేసుకొని ఆందోళనకు దిగినారు. ముఖ్యంగా పరిశ్రమ వదిలే పొగ వల్ల పరిశ్రమ చుట్టూ ఉన్న పంట పొలాలు కలుషితమవడమే కాకుండా.. కొన్ని కిలోమీటర్ల మేర పంట పొలాలపై నల్లటి దుమ్ము కమ్ముకొని దిగుబడి రావడం లేదని..తాము అనారోగ్యాల పాలవుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ముఖ్యంగా ఆ పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో కూడా ఆ పరిశ్రమ వదిలే పొగ వల్ల నల్లటి దుమ్ము పేరుకుపోవడంతో విద్యార్థులు కూడా అనారోగ్యాల పాలవుతున్నారని.. పై విషయాన్ని తాము ప్రభుత్వ యంత్రాంగానికి.. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు ఫిర్యాదు చేసిన అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని.. గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని అధికార పార్టీ ప్రభావం

వరంగల్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. వరంగల్- ఖమ్మం- నల్గొండ, మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ నియోజకవర్గాలను కైవసం చేసుకోవడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్-రంగారెడ్డి- హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్- ఖమ్మం-నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించి ముందడుగు వేసింది. అయితే ఓటరు నమోదు ప్రక్రియలో మాత్రం కాంగ్రెస్ పార్టీ బాగా వెనుకబడినట్లు వార్తలు అందుతున్నాయి. ఎన్నికల పోరులో గెలుపోటములను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో, పెద్ద ఎత్తున అర్హులను నమోదు చేయించడం పార్టీల ముందున్న అతిపెద్ద సవాలు. ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఓటరు నమోదుపై ప్రారంభం నుంచే పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి బలమైన ఓటు బ్యాంకును సృష్టించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్లను నమోదు చేయించడంలో కొంత నిర్లిప్తత ప్రదర్శించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పార్టీలతో పోలిస్తే, అధికారంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించినంతగా గ్రౌండ్ వర్క్ జరగలేదన్న గుసగుసలు పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశమయ్యాయి. ఓటరు నమోదులో కేడర్ వెనుకబడిందన్న వార్తలు, నివేదికలు అధిష్టానాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో చివరి గడువు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం మరింత దూకుడు పెంచింది. పార్టీ శ్రేణులకు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, మిగిలిన సమయంలోనైనా వేగంగా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆదేశించింది. కాలేజీలు, యూనివర్సిటీలు, ఉద్యోగ సంఘాలు, పట్టభద్రులూ అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, ఆ తర్వాత డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ ఉంటుంది. తుది జాబితా వచ్చే వరకు కూడా దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ.. ప్రారంభ దశలో జరిగిన జాప్యాన్ని పూడ్చడంపైనే ఇప్పుడు పార్టీ దృష్టి కేంద్రీకృతమైంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ బలం ఒక్కటే సరిపోదు. వ్యక్తిగత ప్రభావం, మేధావుల నాడిని పట్టడం చాలా ముఖ్యం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామద్దతు ఉందని భావించడానికి ఒక బలమైన సంకేతం దొరుకుతుంది. అయితే, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రారంభంలో ఎదురైన ఆటంకాలు, కేడర్ నుంచి రావాల్సినంత స్పందన రాకపోవడం వంటి పరిణామాలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయ అవకాశాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్త కళ..

హైదరాబాద్ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ. 714.73 కోట్లతో పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 71 శాతం పూర్తయ్యాయి. ఉత్తర, దక్షిణ వైపుల ఐకానిక్ భవనాలు, రెండు అంతస్తుల ఎయిర్ కాన్‌కోర్స్, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ట్రావలేటర్లతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, మల్టీలెవల్ కార్ పార్కింగ్, మెట్రో స్కైవాక్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. కొన్ని కీలక నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వే జంక్షన్లలో ఒకటైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం రూ. 714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ.. కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వల్ల వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సికింద్రాబాద్ స్టేషన్ ఆధునిక రవాణా కేంద్రంగా కొత్త రూపును సంతరించుకోనుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతిరోజూ సుమారు 180 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం లక్షన్నర మందికిపైగా ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తున్నారు. నగర జనాభా, రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయిలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టేషన్‌కు ఉత్తరం, దక్షిణం వైపున ఆకర్షణీయమైన ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నారు. రెండు అంతస్తుల భారీ ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై వర్షం, ఎండ ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు పూర్తిస్థాయి రూఫింగ్ నిర్మిస్తున్నారు. ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. వీటితో పాటు ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మెట్రో రైల్వే స్టేషన్‌కు నేరుగా అనుసంధానం కల్పించేలా స్కైవాక్ నిర్మాణం చేపడుతున్నారు. దీనివల్ల రైలు దిగిన ప్రయాణికులు బయటకు వచ్చి రహదారులు దాటాల్సిన అవసరం లేకుండా మెట్రోకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు కూడా ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తికాగా.. మిగిలిన 29 శాతం పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణ ప్రధాన స్టేషన్ భవనాలు, ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్, బేస్‌మెంట్, ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఎండ్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన వంతెనలు, మెట్రో స్కైవాక్ అనుసంధాన పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. వీటితోపాటు ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారు. ప్రాజెక్టులో భాగంగా కొన్ని కీలక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కోసం నూతన భవనాన్ని నిర్మించారు. కాజీపేట వైపు కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది.

మంచి నీటి బోరు మోటార్ ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ : నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి, త్రాగు నీటి వసతి సౌకర్యాల కల్పనలో భాగంగా 31 వ డివిజన్ దుర్గమ్మగడ్డ హనుమాన్ దేవాలయాన్ని సందర్శించారు. దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేత పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక కార్పోరేటర్ ముఖద్దర్ హుస్సెన్ అలీతో కలిసి మంచి నీటి బోరు మోటారును అధికారికంగా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ...నగరంలోని ప్రతి డివిజన్ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నగరపాలకసంస్థ ఆద్వర్యంలో మా పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రస్తత ఎల్ నినో ప్రభావం, రానున్న వేసవి కాలం దృష్ట్యా... నగర ప్రజల త్రాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలో ప్రజల త్రాగు నీటి సరఫరా లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రాధాన్యతగా మంచి నీటి వసతి సౌకర్యాలతో పాటు డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి క్రార్యక్రమాల లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వివిధ గ్రాంట్ల ద్వారా ప్రజల మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన పనులను ప్రారంభం చేసి శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు.

గాంధీ హాస్పిటల్ మురుగు నీరు రోడ్లపైకి రావడంతో స్థానికులకు సమస్యలు

సికింద్రాబాద్ : లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న గాంధీ హాస్పిటల్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గాంధీ హాస్పిటల్ నుండి వెలువడుతున్న మురుగు నీరు రోడ్లపైకి రావడంతో పాటు దుర్గంధం కారణంగా తాము అనేక అవస్థలు, అనారోగ్యం పాలు అవుతున్నామని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలో తలసాని గాంధీ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డా. ఉషారాణి, వైద్యులతో పాటు, జీహెచ్ఎంసీ, జలమండలి, టీఎస్ఎంఐడీసీ శాఖల అధికారులతో కలిసి సమావేశం అయ్యారు. మురుగు నీటి తో పాటు మార్చురీ నుండి వెలువడుతున్న దుర్వాసన కారణంగా గాంధీ హాస్పిటల్ వెనుక వైపు ఉన్న పద్మారావు నగర్, తదితర ప్రాంతాల వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై, తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక
ఆదివారం, నవంబర్ 8, 2026

కే.పి.హెచ్.బి భూములను ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమ్మేశారు

హైదరాబాద్ : కే.పి. హెచ్.బి భూములను ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమ్మేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. అయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధముగా మహిళా పార్కులను, చిల్డ్రన్ పార్కులను, ఇండోర్ స్టేడియం, ఆట స్థలాలను ఏర్పాటు చేసింది కేసీఆర్ ప్రభుత్వం. రెండు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వం. సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెండు వేల కోట్ల రూపాయలు భూములను అమ్మేశారు. హౌసింగ్ బోర్డ్ వీసీ గౌతం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రేపటి తరాలకు భూములు లేకుండా ప్రభుత్వ భూములను అమ్మేస్తే రాబోయే భావితరాలు ఎలా బ్రతకాలి. హైదరాబాద్ ప్రజలకు శాపంగా మారింది కాంగ్రెస్ ప్రభుత్వం.మియాపూర్ భూములలో ప్రభుత్వ భూములను కాపాడింది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్. సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక మేము కాపాడము అని రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టుకున్నాడు ప్రజావసరాలకు కొరకు పెట్రోల్ పంపు కోసం ఉన్న స్థలాన్ని అమ్మకాలానికి టెండర్లు పిలిపిస్తున్నారు. ఇంత పెద్ద కే.పి. హెచ్.బి కాలనీలో ఫైర్ స్టేషన్ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ప్రతిసారి హౌసింగ్ బోర్డు భూములు అమ్మేశారు.నగర ప్రజలు కరెంట్ సరిగ్గా లేక నీళ్ళు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలీబాబా అరడజను దొంగలు మాత్రం భూములు అమ్మేయడమే టార్గెట్ గా పనిచేస్తున్నారు .కనీసం హైదరాబాద్ నగరం మీద అవగాహన లేక హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. హౌసింగ్ బోర్డ్ అమ్మేయాలని చూస్తే కచ్చితంగా సీఎం రేవంత్ రెడ్డినీ అడ్డుకుంటాం.ఎవరైనా టెండర్ల పాల్గొన్న ఖచ్చితంగా అడ్డుకుంటాం. ప్రాణాలపోయేనా సరే ప్రజల తరుపున నిలబడుతాం ప్రభుత్వ భూములను కాపాడుతాం. ప్రజల తరుపున ప్రశ్నిస్తుంటే కార్యకర్తలను విలేకర్లపై కేసులు పెడుతున్నారు. పార్టీలకు అతీతంగా హౌసింగ్ బోర్డ్ భూములకు కాపాడాలని కోరుతున్నామని అన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ వద్ద అర్ధరాత్రి దారుణ హత్య

కరీంనగర్ : కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ సమీపంలో అర్ధరాత్రి దారుణ హత్య చోటుచేసుకుంది. షాబాద్‌కు చెందిన మద్ది సుధాకర్ అలియాస్ సిద్దు హత్యకు గురయ్యాడు. అశోక్‌నగర్‌కు చెందిన ఇబ్రహీం బేగ్ బండరాయితో మోది సుధాకర్‌ను హత్య చేసినట్లు సమాచారం. మృతుడు స్థానికంగా ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్నట్లు సమాచారం. మద్యం మత్తులో జరిగిన గొడవే హత్యకు కారణమా? లేక పాత కక్షలా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్

ధరలను భారీగా తగ్గించాం

హైదరాబాద్ : మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గించాం. రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం. రోజువారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధర రూ.400 నుంచి రూ.275కు తగ్గించాం. నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధర రూ.8,500 నుంచి రూ.4,000కు తగ్గించాం. నెలవారీ పాస్ వినియోగదారులకు రూ.4,500 ఆదా అవుతోంది. రోజువారీ పాస్ వినియోగదారులకు రూ.125 మేరకు ప్రయోజనం కలుగుతోంది. రోజువారీ పాస్‌లో మెట్రోకు రూ.200, ఆర్టీసీకి రూ.75 కేటాయించాం. రోజుకు నాలుగు సింగిల్ జర్నీలకు అనుమతి వుంటుంది. నెలవారీ పాస్‌లో మెట్రోకు రూ.3,000, ఆర్టీసీకి రూ.1,000 కేటాయించాం. నెలలో గరిష్టంగా 50 మెట్రో సింగిల్ ట్రిప్పులకు అనుమతి వుంటుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఎలాంటి పరిమితులు లేవు. నవంబర్ 8 నుంచి తగ్గించిన ధరలు అమల్లోకి వస్తోంది. ప్రయాణికుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిస్తుందని అయన అన్నారు.

అక్రమ అండాల సేకరణ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది

రాష్ట్రంలో ఇలాంటి వ్యవహారంపై తొలిసారిగా సమాచారం

ఎల్బీనగర్ : అండాల సేకరణ రాకెట్పై సీపీ సుమతి కీలక వ్యాఖ్యలు చేసారు. సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన అక్రమ అండాల సేకరణ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది. తొలుత వ్యభిచార సంబంధిత రాకెట్గా భావించి విచారణ చేపట్టగా.. అండాల సేకరణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎగ్ డొనేషన్ వ్యవహారంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినట్లు అనుమానాలున్నాయని అన్నారు. మహిళలకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాలు సేకరించారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. స్వాధీనం చేసుకున్న హార్మోనల్ ఇంజెక్షన్లపై ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నాం. బాధిత మహిళలకు ఇంజెక్షన్లు ఉపయోగించారా లేదా అనేది ఫోరెన్సిక్ నివేదికతో తేలనుంది. ఏఆర్టీ సెంటర్లు, ఫెర్టిలిటీ సెంటర్ల మధ్య వేర్వేరు బాధ్యతలు ఉంటాయి. ఏఆర్టీ సెంటర్ల ద్వారా బాధితులతో సంప్రదింపులు జరిపినట్లు విచారణలో తేలింది. రాష్ట్రంలో ఇలాంటి వ్యవహారంపై తొలిసారిగా సమాచారం అందడంతో పోలీసులు చాకచక్యంగా కేసును ఛేదించారు. తల్లి కావాలనుకునే వారు బిడ్డ ఆరోగ్యంపై ఆలోచిస్తున్నా.. అండం ఎలా సేకరిస్తున్నారనే అంశాన్ని పట్టించుకోవడం లేదని సీపీ వ్యాఖ్యానించారు. కేసులో అందరినీ నిందితులుగా పరిగణించలేమని స్పష్టం చేసారు. ఎవరి పాత్రకు సంబంధించి ఆధారాలు లభిస్తే వారినే నిందితులుగా గుర్తిస్తాం అని సీపీ బి. సుమతి వెల్లడించారు.

భూముల సర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తిచేయాలి

మెదక్ : కలెక్టరేట్ కార్యాలయంలోజిల్లా సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారి ఏ.డి కిషన్ ఆధ్వర్యంలో భూముల రీ సర్వే ప్రక్రియపై లైసెన్స్ సర్వేయర్లకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ పలు కీలక సూచనలు చేశారుప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి అవినీతికి తావులేకుండా, అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని లైసెన్స్ సర్వేయర్లను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సర్వే మరియు హద్దుల గుర్తింపు (ఈ-ఒతినివ) దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, భూముల రీ-సర్వేలో అలసత్వం చూపినా లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతిక పరికరాలైన డీజీపీఎస్ (అఉఖూ), రోవర్లు మరియు టోటల్ స్టేషన్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. సర్వే పేరుతో రైతులను, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదని, నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన సేవా రుసుములను మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. తహసీల్దార్లు, మండల సర్వేయర్లు మరియు లైసెన్స్ సర్వేయర్లు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మండల సర్వేయర్లు మరియు జిల్లా పరిధిలోని లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే ఎంపీ వంశీకృష్ణపై కుట్రపూరిత విమర్శలు

పెద్దపల్లి : పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణపై రాజకీయ దురుద్దేశంతో కొందరు వ్యక్తులు చేస్తున్న నిరాధార ఆరోపణలను, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నేతకాని మహర్ సేవా సంఘం,సమతా సైనిక్ దళ్ నాయకులు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని కమాన్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి నేతకాని, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మడి కుమార్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం నగేష్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మౌల్కర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఎంపీగా గెలిచిన నాటి నుంచి వంశీకృష్ణ నియోజకవర్గ ప్రగతికి విశేషంగా కృషి చేస్తున్నారని వారు తెలిపారు. మంచిర్యా లలో నేతకాని భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి కోటి రూపాయల నిధులు కేటాయించారని గుర్తుచేశారు. గెజిట్‌లో నేతాని అని తప్పుగా ఉన్న పదాన్ని నేతకానిగా సవరించేందుకు రాష్ట్ర,కేంద్ర గెజిట్లలో ఆయన తీవ్ర కృషి చేస్తున్నారని వివరించారు. వారి తండ్రి రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సైతం నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు కోసం అసెంబ్లీలో పోరాడుతున్నారని పేర్కొన్నారు.

పుర ఎన్నికల్లో తగ్గిన మద్యం, నగదు ప్రభావం

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే భారీగా తగ్గిన ఖర్చు

పోటీ తీవ్రంగా ఉన్న కొన్నిచోట్ల.. కొనసాగిన ప్రలోభాలు

అమరావతి: గతంలో మున్సిపల్ ఎన్నికలంటే చిన్నచిన్న పట్టణాల్లోనూ డబ్బు, మద్యం పంపిణీ భారీగానే ఉండేది. సంపన్నుల వార్డులైతే వెండిగ్లాసులు, ప్లేట్లు ఇచ్చేవారు. కానీ ఈసారి పట్టణ స్థానిక సంస్థల్లో డబ్బు, మద్యం ప్రభావం గణనీయంగా తగ్గింది. గతంతో పోలిస్తే ఖర్చు బాగా తగ్గింది. అధికశాతం ఓటుకు రూ. 500-700 లోపే ఇచ్చారు. విశాఖపట్నం, గుంటూరులో కొన్నిచోట్ల బాగా ఖర్చు పెట్టారనే అంచనా ఉంది.ఎక్కువచోట్ల నామమాత్ర పంపిణీయేఅసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. ఇప్పుడు డబ్బు, నగదు ప్రభావం బాగా తగ్గిందని కూటమి నేతలతో పాటు వైకాపా నాయకులూ చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వార్డుల్లో గెలవడాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటారు. అందుకు అనుగుణంగానే అక్కడ ఖర్చుచేయాలి. ఈ ఎన్నికల్లో వైకాపా మొదట్లోనే చేతులెత్తేయడంతో కూటమి పార్టీల నాయకులు డబ్బు పంపిణీపై దృష్టిపెట్టలేదు. కొన్నిచోట్ల నామమాత్రంగా రూ.500-700 పంపిణీ చేసి సరిపెట్టారు.నామినేషన్లు వేయించి.. ముఖం చాటేసిన వైకాపా నేతలువైకాపా తరఫున బరిలో నిలిచిన అభ్యర్థులు నామినేషన్ వేయడానికే పరిమితమయ్యారు. అధిష్ఠానం నుంచి వారికి ఆర్థిక తోడ్పాటు లేదు. స్థానిక నేతలు ఏమీ చేయలేమంటూ ముఖం చాటేశారు. దీంతో వార్డు సభ్యులు సొంతంగా ఖర్చుచేయలేక చేతులెత్తేశారు. నామమాత్ర ప్రచారానికే పరిమితం అయ్యారు. నగరపాలక సంస్థలో పోటీచేయాలంటే కనీసం రూ. 15 కోట్లయినా కావాలని, ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత ఖర్చుపెట్టినా గెలుపు కష్టమని ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైకాపా నేత ఒకరు వ్యాఖ్యానించారు.కొన్నిచోట్ల వైకాపా ప్రలోభాలుపోటీ గట్టిగా ఉన్నచోట్ల వైకాపా నేతలు ప్రలోభాలకు దిగారు. భారీ ఎత్తున మద్యం, నగదు పంపిణీకి దిగారు. నంద్యాల జిల్లా డోన్‌లో వైకాపా నేతలు డబ్బు పంచుతూ దొరికిపోయారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో వైకాపా నేత నివాసంలో పోలీసులు నగదు, మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8 చోట్ల వైకాపా నేతలు ఇలా పోలీసులకు పట్టుబడ్డారు. ప్రకాశం జిల్లా చీమకుర్తితో పాటు కొన్నిచోట్ల ప్రధానపార్టీల అభ్యర్థులు నగదు పంపిణీలో పోటీపడ్డారు. నగదుతోపాటు చీరలు, కుక్కర్లు పంపిణీ చేశారు.

ప్రజాసమస్యల పరిష్కారానికై నా పోరాటం

విజయవాడ : ప్రజా సమస్యలపై నా పోరాటం కొనసాగుతోందని మాజీ ఐపిఎస్ ఏ బి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. షిర్డీ సాయి కంపెనీ నుంచి ట్రాన్స్ఫార్మర్ల కొనుగోలు వ్యవహారంపై హైకోర్టులో నేను దాఖలు చేసిన కేసులో ఈరోజు వాదనలు పూర్తయ్యాయి. మరోవైపు, మేయర్ ఎన్నికల్లో నాకు వచ్చిన ఓట్లను చూసి ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటానని కొందరు ఊహించుకున్నట్లున్నారు. కానీ రాజకీయాలను వదిలి వెళ్లే వ్యక్తిని కాదని అర్థమయ్యాక, సోషల్ మీడియాలో నాపై విమర్శలు, అవహేళనలు, స్పాన్సర్డ్ వీడియోల ప్రచారం మొదలుపెట్టారు. నన్ను నా పక్కనున్న వాళ్లు చెడగొడుతున్నారట! బహుశా నేను సొంతంగా ఆలోచించలేనని వారి అభిప్రాయమేమో! నా పరువు పోయిందట! సుజనా చౌదరి వెనకుండి నడిపించి నా రాజకీయ ప్రస్థానానికి అడ్డుకట్ట వేశారట! చంద్రబాబు నాయుడు ని నేను ఈవెంట్ మేనేజర్ అన్నందుకే ఓట్లు రాలేదట! కోగంటి సత్యంని, గౌతమ్ రెడ్డి ని, బోండా ఉమ రిని ప్రశ్నించినందుకే ఓట్లు రాలేదని వారి అభిమానులు కూడా అనుకుంటున్నారు! ఒక్క విషయం స్పష్టంగా చెబుతున్నాను. విజయవాడ మేయర్ పదవికి పోటీ చేసినప్పుడు నా బాధ్యత విజయవాడ ప్రజల ప్రయోజనాల గురించి మాట్లాడటం, ప్రజా సమస్యలపై ప్రశ్నించడం. బుడమేరు సమస్యపై నిలదీయడం, ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని గుర్తుచేయడం. ఇవన్నీ రాజకీయాల కోసం కాదు.. ప్రజల పక్షాన నిలబడటం కోసం అన్నారు. అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేశామని సెప్టెంబర్ 15న ఊ 588 విడుదల చేసి, పత్రికల్లో గొప్పగా ప్రచారం చేసుకున్నారు. నెల రోజుల్లోనే ప్రక్రియ పూర్తిచేయాలని ఆ జీవోలో పేర్కొన్నారు. అప్పుడే నేను స్పష్టంగా చెప్పాను.. ప్రకటనలు చేసినంత మాత్రాన పనులు పూర్తికావు, వేచి చూడండి అని. నేను చెప్పినట్లుగానే నెలన్నర గడిచినా పనులు ముందుకు సాగలేదు. ఇప్పుడు మళ్లీ 60 రోజుల్లో పూర్తి చేయాలని మరో ఊవిడుదల చేశారు.మీకు ప్రతిరోజూ పత్రికల్లో పెద్ద పెద్ద అక్షరాలతో మీ పేరు కనిపించడం ముఖ్యం కావచ్చు. కానీ ప్రజలకు మాత్రం ఇచ్చిన హామీలు నెరవేరడం ముఖ్యం. అందుకే అవహేళనలతో, స్పాన్సర్డ్ ప్రచారాలతో వెనక్కి తగ్గించగలమని భావించే వారికి ఒక్కటే సమాధానం: మైదానంలోకి దిగిన తర్వాత విమర్శలకు భయపడి పారిపోయే వ్యక్తిని కాదు. మీ విమర్శలు కొనసాగించండి.. నా పోరాటం కూడా కొనసాగుతుంది. మీ వెనుక ఉన్నవారికి కూడా ఇదే విషయం చెప్పండని అయన సూచించారు. అలాగే, కష్టకాలంలో నాతో కలిసి నిలబడిన వ్యక్తులను ఎవరో ఏదో అన్నారని, అంటారని విసిరిపారేసే కరివేపాకు రాజకీయాలు చేసే వ్యక్తిని కూడా నేను కాదు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల పక్షాన ప్రజాసమస్యల పరిష్కారానికై నా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసారు.

టీపీసీసీ కంట్రోల్ చేయలేకపోతున్నారే...



హైదరాబాద్ : తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అంతర్గత కలహాలు, క్రమశిక్షణా రాహిత్యం పరాకాష్టకు చేరాయి. ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా, పార్టీ యంత్రాంగాన్ని ఏకతాటిపై నడిపించడంలో పిసిసి పూర్తిగా విఫలమవుతోంది. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరికి వారే యజమానులుగా వ్యవహరిస్తూ, బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్యం.. ఇక్కడ స్వేచ్ఛ ఎక్కువ అంటూ ప్రతి సందర్భంలోనూ సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అసలు కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అనే పదానికి అర్థమే లేకుండా పోతోందని సొంత పార్టీ శ్రేణులే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.పార్టీలో ఒకరి తర్వాత ఒకరు క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్నా వారిని సరైన దారిలో పెట్టలేకపోవడానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతకానితనమే ప్రధాన కారణమని గాంధీ భవన్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. స్వతహాగా బలమైన ప్రజాదరణ లేని నాయకుడిగా ముద్రపడిన మహేష్ గౌడ్, కనీసం తనకు దక్కిన పిసిసి అధ్యక్ష పదవి ద్వారా వచ్చే పవర్స్‌ను కూడా ఉపయోగించలేకపోతున్నారు. సీనియర్ నేతలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా, పబ్లిక్ వేదికలపై పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నా కేవలం నోటీసులతో కాలయాపన చేయడం తప్ప, కఠినమైన చర్యలు తీసుకునే నైతిక ధైర్యం ఆయనలో కనిపించడం లేదు.పిసిసి చీఫ్ కనబరుస్తున్న ఈ బలహీనమైన వైఖరిపై పార్టీలోని ఒక బలమైన వర్గం తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. డిసిసి అధ్యక్షుల ఎంపిక నుంచి ప్రభుత్వం-పార్టీ సమన్వయం వరకు ప్రతి విషయంలోనూ మహేష్ గౌడ్ దిగువ స్థాయి ఒత్తిళ్లకు లొంగిపోతున్నారని, అధిష్ఠానంతో ఉన్న సాన్నిహిత్యాన్ని కూడా పార్టీ ప్రయోజనాల కోసం ఉపయోగించలేకపోతున్నారని విమర్శిస్తున్నారు. ఒకవైపు బిఆర్ఎస్, బిజెపిలు క్షేత్రస్థాయిలో దూకుడు పెంచుతుంటే, పీసీసీ అధ్యక్షుడు మాత్రం పార్టీలోని వ్యతిరేకత స్వరాలను అదుపు చేయలేక చేతులెత్తేయడం ప్రభుత్వ ఇమేజ్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.సొంత నియోజకవర్గాల్లో నేతల ఆధిపత్య పోరు, మంత్రివర్గ సభ్యులు-ఎమ్మెల్యేల మధ్య ఘర్షణలు నిత్యకృత్యంగా మారినా పీసీసీ స్పందించకపోవడం రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బగా మారే ప్రమాదముంది. క్రమశిక్షణ విధింపులో జవాబుదారీతనం లేకపోతే ప్రజాస్వామ్యం అనే ముసుగులో పార్టీ కట్టుబాట్లు పూర్తిగా కూలిపోతాయని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా పీసీసీ చీఫ్ తన శైలిని మార్చుకుని ఉక్కుపాదం మోపకపోతే, తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ ఆధిపత్య పోరు కాస్తా నియంత్రించలేని దావానలంగా మారుతుందన్న అసంతృప్తి కనిపిస్తోంది.

పేకమేడలా కూలిపోయిన మూడంతస్తుల భవనం

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూ ఢిల్లీలోని పాత ఢిల్లీ ప్రాంతంలో దారుణ విపత్తు సంభవించింది. అత్యంత రద్దీగా ఉండే చావ్రి బజార్ ప్రాంతంలో ఉన్న ఒక మూడంతస్తుల పాత భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. భవన శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోవడంతో సహాయక బృందాలు ముమ్మరంగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. వారిని సురక్షితంగా బయటకు తీస్తూ ఆస్పత్రులకు తరలిస్తున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ నగరాన్ని వరుస భవన ప్రమాదాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. పాత ఢిల్లీ ప్రాంతంలో ఎంతో బిజీగా ఉండే చావ్రి బజార్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న ఒక మూడంతస్తుల పురాతన నిర్మాణం ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర భయాందోళనలు వ్యక్తమయ్యాయి. విపరీతమైన శబ్దంతో భవనం నేలమట్టం కావడంతో.. స్థానికులు, వ్యాపారులు ప్రాణాలు దక్కించుకోవడానికి తీవ్ర భయంతో పరుగులు తీశారు. ఈ ఘోర ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. మరికొంత మంది శిథిలాల కిందే చిక్కుకున్నారుమూడు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో.. స్థానికులంతా తీవ్రగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే అగ్నిమాపక శాఖ, అత్యవసర సహాయక బృందాలకు సమాచారం అందించారు. దీంతో వారంతా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముఖ్యంగా ఆరు అగ్నిమాపక యంత్రాలు, ప్రత్యేక రెస్క్యూ వాహనాలు, వాటర్ టెండర్లతో పాటు పెద్ద సంఖ్యలో సిబ్బంది తరలి వచ్చి శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ప్రమాదానికి గురైన భవనం ఇరుకైన వీధిలో ఉండగా.. సహాయ చర్యలు చేపట్టేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. ముఖ్యంగా పోలీసు ఉన్నతాధికారులు, అగ్నిమాపక శాఖ సీనియర్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో సహాయక చర్యలు వేగవంతంగా సాగుతున్నాయి. శిథిలాల కింద భారీగా ప్రజలు చిక్కుకుపోయి ఉంటారని భావిస్తుండటంతో.. వారిని సురక్షితంగా వెలికితీసేందుకు అత్యాధునిక సాధనాలను వినియోగిస్తున్నారు. ఈ దురదృష్టకర సంఘటనలో ఇప్పటి వరకు ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని అధికారులు ధ్రువీకరించారు. శిథిలాల నుంచి గాయపడిన పలువురిని రక్షించి, సమీపంలోని ఆసుపత్రులకు అత్యవసర చికిత్స కోసం తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో భవనంలో ఎంతమంది ఉన్నారు, కూలిన సమయానికి కింద ఎంతమంది బాటసారులు లేదా వ్యాపారులు ఉన్నారనే దానిపై అధికారులు స్పష్టత నిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. శిథిలాలను పూర్తిగా తొలగించే వరకు సహాయక ఆపరేషన్ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. ఢిల్లీలో పాతబడిన భవనాలు కూలిపోవడం ఇటీవల కాలంలో పరిపాటిగా మారింది.

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టు

గుంటూరు : వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ని పోలీసులు అరెస్టు చేసారు. చ పోలింగ్ అయిన తరువాత బ్యాలెట్ బాక్సు రోడ్డు మీద దించి పక్కకు ఎందుకు తీసుకెళ్తున్నారు అని ప్రశ్నించినందుకు లేళ్ల అప్పిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసారు. వెంగళాయపాలెంలో ఎన్నిక పూర్తయిన తర్వాత స్ట్రాంగ్ రూమ్ తీసుకువెళ్తూ నల్లపాడు సెంటర్లో బ్యాలెట్ బాక్స్ దించి అధికారి పక్కకి తీసుకువెళ్లడాన్ని వైకాపా శ్రేణులు ప్రశ్నించారు. బ్యాలెట్ బాక్స్ ను మార్చేయడానికి టిడిపి వాళ్ళ దగ్గర కు తీసుకెళ్తున్నాడంటు నిలదీసారు. బ్యాలెట్ బాక్స్ బయటికి రావడానికి నిరసిస్తూ నల్లపాడులో రెండు గంటల పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యే ఆ సమాచారం తెలుసుకుని నల్లపాడు వెళ్లారు. బ్యాలెట్ బాక్స్ తో ధర్నా చేస్తున్న నాయకులకు సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్నారు. ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేసారు. తరువాత పోలీసులు బ్యాలెట్ బాక్స్ ను తీసుకువెళ్లిపోయారు. ఎన్నికల సిబ్బందిని అడ్డుకుని బ్యాలెట్ బాక్స్ లో తమ ఆధీనంలోకి తీసుకున్నారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పై కేసు నమోదు చేసారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అప్పిరెడ్డిని నగరంపాలెం పోలీస్ స్టేషన్ నుంచి నల్లపాడు పోలీస్ స్టేషన్ తరలించారు. అప్పిరెడ్డి పై నాన్ బెయిల్ సెక్షన్లతో కేసులు నమోదు చేసారు.

ఎఫ్ఎంజీ వైద్యుల అరెస్టు... కోఠిలో ఉద్రిక్తత

హైదరాబాద్ : హైదరాబాద్ కోఠిలోని డీఎంఈ కార్యాలయం ముందు ఎఫ్ఎంజీ వైద్యులు ఆందోళనకు దిగారు. తమ డిమాండ్ల కోసం నిరసన తెలుపుతున్న వైద్యులను పోలీసులు అడ్డుకున్నారు. వైద్యులను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు.ఎఫ్ఎంజీ డాక్టర్లు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నెలకు రూ.29,792 స్టైపెండ్ చెల్లించాలని డిమాండ్ చరేసారు. జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆందోళనకు దిగారు . తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతుంటే పోలీసులతో అడ్డుకుంటున్నారని వైద్యులు ఆవేదన వ్యక్తం చేసారు.

భార్యను హత్య చేసి గోదావరిలో పడేసిన ఏఆర్ కానిస్టేబుల్

భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలం పట్టణంలో ఒక ఏఆర్ కానిస్టేబుల్ తన భార్యను హతమార్చి గోదావరి లో పడేసాడు. కానిస్టేబుల్ నరేందర్ ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యనే హత్య చేసాడు. నరేందర్ కు భవాని సోషల్ మీడియా ద్వారా పరిచయమైయింది. రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఎనిమిది నెలల క్రితం పాప జన్మించగా ఆ తర్వాత చిన్నారి చనిపోయింది. తరువాత ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. దాంతో నరేందర్ భార్యను హతమార్చి మృతదేహాన్ని గోదావరిలో పడేసాడు.విషయం తెలిసిన పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో భవాని మృతదేహం కోసం గాలిస్తున్నారు. భార్యను హత్య చేయడానికి దారితీసిన కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఉన్నత విద్యలో ఏఐ వినియోగంతో విప్లవాత్మక మార్పులు

పరీక్షల నిర్వహణ, డిజిటల్ మూల్యాంకనం, బోధన, క్యాంపస్ పరిపాలనలో ఏఐ వినియోగంపై చర్చ

హైదరాబాద్ : ఉన్నత విద్యలో ఏఐ వినియోగంతో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా 'నెక్స్ట్ 1.0' సదస్సు నిర్వహించారు. క్యాంప్ఎక్స్ ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో కొండాపూర్లోని గూగుల్ హైదరాబాద్ కార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో తెలంగాణ, ఏపీకి చెందిన పలువురు వైస్ ఛాన్సలర్లు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఏఐ సహా ఆధునిక సాంకేతిక కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పరీక్షల నిర్వహణ, డిజిటల్ మూల్యాంకనం, బోధన, క్యాంపస్ పరిపాలనలో ఏఐ వినియోగంపై సదస్సులో చర్చించారు.

వరంగల్‌లో భారీగా కల్తీ కారం

పసుపు పొడి పట్టివేత.. 2,250 కిలోలు స్వాధీనం

వరంగల్ : నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీపై అధికారులు కొరడా ఝుళిపించారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి భారీగా కల్తీ కారం, పసుపు పొడిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కరీమాబాద్‌కు చెందిన ఆకుతోట గోపిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 2,250 కిలోల కల్తీ కారం, పసుపు పొడిని అధికారులు పట్టుకోగా, వీటి విలువ సుమారు రూ.5.92 లక్షలుగా అంచనా వేశారు. ఎలాంటి లైసెన్స్, లేబుల్స్ లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో పొడులను ప్యాకింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపారులపై అధికారులు చర్యలు చేపట్టారు.

ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్

కుటుంబానికి అండగా కాంగ్రెస్

- కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

జనగామ : తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ వుంటుందని కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఉద్యమకారుడు, సొంత పార్టీ నాయకుడు ఆత్మహత్య చేసుకుని మరణిస్తే కనీసం పట్టించుకోని బీఆర్ఎస్, అలాంటిది ఉద్యమ పార్టీ అని చెప్పుకోవడం విడ్డూరమని అన్నారు. బచ్చన్నపేట మండలం, కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వేముల లక్ష్మణ్ గౌడ్ . బీఆర్ఎస్ పార్టీ కోసం అప్పు చేసి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. అప్పులు తీర్చలేక, పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు ఎలాంటి సహాయం అందకపోవడంతో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు, ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అయన అందజేసారు. ఎన్నికల్లో లక్ష్మణ్ గౌడ్‌ను వాడుకుని లబ్ధిపొంది, నేడు కనీసం ఆయన కుటుంబాన్ని కూడా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించలేదని అయన విమర్శించారు.

అమెరికాలో నల్గొండ యువతి అదృశ్యం

నల్గొండ : నల్గొండ జిల్లాకు చెందిన యువతి అమెరికా లో మిస్సింగ్ అయింది. కనగల్ మండలం శాబ్దులాపురం గ్రామం నుంచి యాదగిరిరెడ్డి?రూప దంపతుల కుమార్తె శ్రీజ (23) ఉన్నత చదువుల కోసం అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లింది. ఓ కళాశాలలో చదువుతూ పార్ట్‌టైమ్ జాబ్ చేస్తోంది. ఈ నెల 2వ తేదీన వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదని, ఫోన్ లొకేషన్ సమీపంలోని బీచ్ వద్ద చూపిస్తోందని తోటి విద్యార్థినులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు.మిస్సింగ్ కేసు నమోద యింది. పోలీసులు గాలింపులు చేసట్టారు. ఒక్కగానొక్క కుమార్తె అమెరికాలో అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన కార్యక్రమంలో మంత్రి వివేక్


మంచిర్యాల : మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం, పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. చెన్నూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పేదలు, కార్మికులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే మా బాధ్యత. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే మా నిరంతర లక్ష్యమని అన్నారు.

అనిల్ రావిపూడి.. ఈసారి యాక్షన్ కూడా గట్టిగానే..



అనిల్ రావిపూడి సినిమాల్లో కామెడీకి ఎంత ప్రాధాన్యం ఉంటుందో తెలిసిందే. ముఖ్యంగా వెంకటేష్‌తో ఆయన తీసిన సినిమాల్లో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ బాగా వర్కవుట్ అయింది. అయితే ఇప్పుడు 'జనవరి 12 విడుదల' కోసం అనిల్ మరో సర్ ప్రైజ్ రెడీ చేస్తున్నాడు. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను కూడా సెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం ఏకంగా కజకిస్థాన్‌లో షూటింగ్ చేస్తుండటం విశేషం. నిజానికి అనిల్ సినిమాల్లో యాక్షన్ కొత్తేమీ కాదు. 'పటాస్', 'సరిలేరు నీకెవ్వరు' లాంటి చిత్రాల్లో ఫైట్స్‌కు మంచి స్పేస్ ఇచ్చారు. కానీ వెంకటేష్‌తో చేసిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాల్లో కామెడీకే ఎక్కువ స్కోప్ ఇచ్చారు. ఇప్పుడు అదే హీరోతో మరో సినిమా చేస్తూ కళ్యాణ్ రామ్‌ను కూడా కలిపి యాక్షన్ ఎపిసోడ్ తెరకెక్కిస్తున్నారు. ఈసారి ఇద్దరు హీరోలతో అనిల్ ఎలాంటి ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తారనేది చూడాలి. ప్రస్తుతం కజకిస్థాన్‌లో జరుగుతున్న షెడ్యూల్‌లో స్టంట్ మాస్టర్ రియల్ సతీష్ ఆధ్వర్యంలో భారీ ఫైట్ చిత్రీకరిస్తున్నారు. వెంకటేష్, కళ్యాణ్ రామ్ ఇద్దరూ ఈ సన్నివేశంలో పాల్గొంటున్నారు. అక్కడి కొండలు, మంచు ప్రాంతాలను ఉపయోగించుకుని యాక్షన్‌ను కొత్తగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇద్దరూ వింటర్ లుక్స్‌లో వీడియోలు ఫొటోలు కూడా బయటకొచ్చాయి. మరోవైపు ఈ సినిమాలో వెంకటేష్, కళ్యాణ్ రామ్ బావాబావమరుదులుగా నటిస్తున్నారు. ఈ బంధం చుట్టూ కామెడీ నడిపిస్తూనే ఇద్దరినీ ఒకే యాక్షన్ ఎపిసోడ్‌లో చూపించనున్నారు. పైగా కళ్యాణ్ రామ్‌తోనే 'పటాస్' ద్వారా దర్శకుడిగా పరిచయమైన అనిల్, ఇన్నేళ్ల తర్వాత ఆయనను వెంకీతో కలిపి మల్టీస్టారర్ చేస్తున్నారు. ఇక కజకిస్థాన్‌లో ఫైట్‌తో పాటు ఓ పాటను కూడా చిత్రీకరించబోతున్నారు. కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. గతంలో అనిల్ సినిమాల్లో పాటలు, కామెడీ ఎక్కువగా ఇండోర్ సెట్స్, ఫ్యామిలీ నేపథ్యంలో కనిపించేవి. ఇప్పుడు విదేశీ లొకేషన్లను కూడా ఉపయోగించుకుంటూ సినిమా మేకింగ్‌లో కొంత మార్పు చూపిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్న 'జనవరి 12 విడుదల'ను 2027 సంక్రాంతికి తీసుకురానున్నారు. ఇప్పటికే హైదరాబాద్ పరిసరాల్లో ప్రధాన చిత్రీకరణ పూర్తయింది. కజకిస్థాన్ షెడ్యూల్ తర్వాత కొద్దిపాటి షూటింగ్ పనులు మిగిలి ఉండగా, నవంబర్ చివరికల్లా చిత్రీకరణ పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. త్వరలో పాటలతో ప్రమోషన్లు స్టార్ట్ చేయాలని చూస్తున్నారు.

గార్జియస్ లుక్ లో అందరినీ తన వైపు తిప్పుకున్న శ్రీలీల



డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యాం అంటూ ఇప్పటికే ఎంతోమంది సెలబ్రెటీలు చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ జాబితాలోకి శ్రీ లీలా కూడా చేరారు. సెట్ లో నటిస్తూనే మరొకవైపు కాస్త ఖాళీ సమయం దొరికితే చాలు పుస్తకాలు తిరిగేసింది.ఆ కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది. డాక్టర్ పట్టా కూడా అందుకుంది. ఇటు సినిమాలలో అద్భుతమైన నటన కనబరుస్తూ.. అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. అటు తన టాలెంట్ ను కూడా ప్రూవ్ చేసుకుంది. శ్రీ లీల విషయానికి వస్తే.. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ భువన్ గౌడ తీసిన చిత్రాలను సోషల్ మీడియాలో చూసిన డైరెక్టర్ ఏ.పీ.అర్జున్ ఈమెకు తన దర్శకత్వంలో వచ్చిన కిస్ అనే చిత్రంలో అవకాశం ఇచ్చారు. 2019లో వచ్చిన ఈ చిత్రం ద్వారా ఈమె వెండితెరకు పరిచయమైంది. తెలుగులో మాత్రం దర్శకుడు రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో వచ్చిన రొమాంటిక్ మ్యూజికల్ ఫిలిం పెళ్లి సందడి చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఇందులో తన అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. అయితే ఈమెకు కమర్షియల్ సక్సెస్ ఇచ్చింది మాత్రం రవితేజ హీరోగా నటించిన ధమాకా మూవీ. భగవంత్ కేసరి, ఆదికేశవ, ఎక్స్ట్రార్డినరీ మ్యాన్, గుంటూరు కారం, రాబిన్ హుడ్, మాస్ జాతర, ఉస్తాద్ భగత్ సింగ్ ఇలా ఎన్నో చిత్రాలు చేసింది. కానీ ఈమెకు అనుకున్నంత స్థాయిలో గుర్తింపు రాలేదు. అటు తమిళ్లో పరాశక్తి సినిమాలో కూడా నటించినా.. అది కూడా మెప్పించలేకపోయింది. కానీ పుష్ప 2 చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా నటిస్తున్న ధర్మన్ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్న ఈమె.. మరోవైపు బాలీవుడ్ పై దృష్టి సారించింది ఈ ముద్దుగుమ్మ. సినిమాల ద్వారా ఎంత బిజీగా ఉన్నా ఇటు సోషల్ మీడియాలో మాత్రం నిత్యం యాక్టివ్ గా ఉంటుంది శ్రీలీల. అందులో భాగంగానే తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. గార్జియస్ లుక్ లో ఉన్న ఈమె అందం చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా రూపొందించిన సిల్వర్ లెహంగా సెట్ లో కనిపించి మెస్మరైజ్ చేసింది. ఆధునిక హంగులతో , సాంప్రదాయ శైలిని కలగలిపి డిజైన్ చేసిన ఈ సిల్వర్ లెహంగా , చోళీ ఈమె అందాన్ని రెట్టింపు చేసింది. ముఖ్యంగా చోళీ విషయానికి వస్తే షీర్ నెట్ బేస్ పై క్లిష్టమైన హ్యాండ్ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేశారు. భుజాల భాగం నుండి కిందకు వేలాడేలా డిజైన్ చేసిన ముత్యాల టస్సెల్స్ ఈ బ్లౌజ్ కు ప్రత్యేకమైన రాయల్ లుక్ ను అందిస్తున్నాయి.ఇక లెహంగా విషయానికి వస్తే జరీ వర్క్ తో దీనిని డిజైన్ చేశారు. దీపావళి స్పెషల్ ఈవెంట్ లో భాగంగా ఈ అద్భుతమైన ఔట్ఫిట్ ధరించి అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం ఈమె షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

రెడ్ అవుట్‌ఫిట్‌లో స్టన్నింగ్ లుక్‌తో మెరిసిన పాలక్!


ప్రముఖ నటి శ్వేతా తివారీ కూతురు పాలక్ తివారీ సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన రెడ్ కలర్ ట్రెడిషనల్ డ్రెస్ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఎంబ్రాయిడరీ బ్లౌజ్, ప్లీటెడ్ లెహెంగాలో ఆమె ప్రిన్సెస్ లా మెరిసిపోతోంది. గ్లామర్ లుక్స్‌తో పాటు ఆమె సినిమాల విశేషాలు ఇప్పుడు చూద్దాం.

రెడ్ డ్రెస్‌లో అద్భుతమైన లుక్: తాజాగా పాలక్ తివారీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫోటోల్లో ఎంతో అందంగా కనిపించింది. బ్లూ, గోల్డ్ వర్క్ ఉన్న ఎంబ్రాయిడరీ రెడ్ బ్లౌజ్.. దానికి జోడీగా ఫ్లోయింగ్ ప్లీటెడ్ లెహెంగా ధరించింది. ఇక బ్యాక్‌గ్రౌండ్ రెడ్ లైటింగ్ మధ్య హెయిర్ లూప్‌గా వదిలేసి, సాఫ్ట్ మేకప్ వేసుకున్న ఆమె లుక్ అందరినీ కట్టిపడేస్తోంది. ఈ ఫొటోలకు కుర్రకారు నుంచి విపరీతంగా లైకులు వస్తున్నాయి.

'బిజ్లీ బిజ్లీ'తో వచ్చిన క్రేజ్: 2021లో వచ్చిన 'బిజ్లీ బిజ్లీ' మ్యూజిక్ వీడియో పాలక్ కెరీర్‌ను ఒక్కసారిగా మార్చేసింది. ఆ సాంగ్‌తో దేశవ్యాప్తంగా విపరీతమైన గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఆ తర్వాత సినిమాల వైపు అడుగులు వేసింది. ఇక సల్మాన్ ఖాన్ సరసన 'కిసీ కా భాయ్ కిసీ కి జాన్' మూవీతో బాలీవుడ్ వెండితెరకు పరిచయమైంది. ప్రస్తుతం వరుస సినిమాలు, ఓటీటీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా దూసుకుపోతోంది.



రామాయణంలో భాగం కావడం మర్చిపోలేని అనుభూతి..



ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'రామాయణ: పార్ట్ 1'కు అన్ని వర్గాల నుంచి మంచి స్పందన వస్తోంది. విడుదలైనప్పటి నుంచి ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సినిమాలో శూర్పణఖ పాత్రలో కనిపించిన రకుల్ ప్రీత్ సింగ్ తన లుక్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. సినిమా రిలీజ్ అయిన మరుసటి రోజే రకుల్ సోషల్ మీడియాలో షూటింగ్ నాటి ఫొటోలను షేర్ చేస్తూ ఒక ఎమోషనల్ నోట్ రాశారు. మన దేశపు సంస్కృతిలో భాగమైన ఈ కథలో నటించడం తన అదృష్టమని ఆమె చెప్పుకొచ్చారు. ఆ విశేషాలు ఇలా వున్నాయి..

రామాయణం లాంటి గొప్ప కథలో శూర్పణఖ పాత్ర చేయడానికి తాను ఎంతో కాలంగా ఎదురుచూశానని రకుల్ చెప్పారు. తరతరాలుగా మన జీవితాల్లో భాగమైన ఈ ఇతిహాసంలో నటించడం ప్రతిరోజూ దొరికే అవకాశం కాదని ఆమె అన్నారు. ఇక ముఖ్యంగా రామరావణ యుద్ధానికి ప్రధాన కారణమైన శూర్పణఖ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయని, ఆ పాత్రను సరిగ్గా చూపించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని రకుల్ పేర్కొన్నారు.

భారతీయ కథను ఇంత భారీ స్థాయిలో ప్రపంచానికి పరిచయం చేసిన దర్శకుడు నితీశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రాలకు రకుల్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

అలాగే రాముడిగా చేసిన రణ్‌బీర్ కపూర్, సీతగా నటించిన సాయిపల్లవి, రావణుడిగా కనిపించిన యశ్‌తో పాటు కాజల్ అగర్వాల్, శోభన, రవి దూబేల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇక వీరందరూ ఎంతో కష్టపడి ఈ మ్యాజిక్‌ను స్క్రీన్ పైకి తెచ్చారని ఆమె అభినందించారు. హెయిర్ అండ్ మేకప్ టీమ్ కష్టం: శూర్పణఖ పాత్రకు తగ్గట్టుగా తన లుక్‌ను తీర్చిదిద్దిన హెయిర్ అండ్ మేకప్ టీమ్‌కు రకుల్ క్రెడిట్ ఇచ్చారు. ట్రైలర్ వచ్చినప్పటి నుంచే తన గెటప్‌కు మంచి రెస్పాన్స్ రావడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, ఒక భారతీయురాలిగా గర్వపడే క్షణమని రకుల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

సినిమాలో లీడ్ రోల్స్ ఎంత బాగా చేసినా, కొన్నిసార్లు సైడ్ క్యారెక్టర్లు లేదా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలేన అవి ఆడియన్స్ చాల కాలం గుర్తుంచుకుంటారు. ఇక ఇప్పుడు 'రామాయణ' సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్ చేసింది అదే జాబితాలోకి వస్తుంది. స్క్రీన్ మీద ఆమె కనిపించేది కొద్దిసేపే అయినా, ఆ తక్కువ టైంలోనే తన అద్భుతమైన హావభావాలతో థియేటర్లలో ఉన్నవాళ్లందరినీ కట్టిపడేసింది. ఇప్పటివరకు సినిమాల్లో వచ్చిన శూర్పణఖ పాత్రలన్నింటికంటే రకుల్ చాలా డిఫరెంట్‌గా, మోస్ట్ బ్యూటిఫుల్ రాక్షస పాత్రలా కనిపించిందని ఫాన్స్ పోస్ట్ లు పెడుతున్నారు. ఇక మొత్తానికి శూర్పణఖ పాత్రతో రకుల్ ప్రీత్ సింగ్ తన కెరీర్‌లోనే ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. తెరపై ఆమె కనిపించిన తీరు, ఇప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేసిన షూటింగ్ విశేషాలు ఫాన్స్ ను మెప్పిస్తున్నాయి.

వారణాసి: ఇక స్టాంగ్‌గా మొదలవ్వాలి!



'వారణాసి'కి సంబంధించిన నెక్స్ట్ అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఏప్రిల్ 7న సినిమా విడుదల కానుండగా నవంబర్ కూడా వచ్చేసింది. అంటే చేతిలో ఉన్నది ఐదు నెలల సమయమే. ఇంత భారీ సినిమాకు ఇప్పటినుంచే ప్రమోషన్లు మరింత దూకుడుగా ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రాజమౌళి గత సినిమాల ప్రచారంతో పోలిస్తే ఈసారి అసలు హడావుడి మొదలవ్వాల్సి ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు మహేష్ బాబు రుద్ర లుక్‌తో పాటు ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్రల పోస్టర్లు వచ్చాయి. కాన్సెప్ట్ వీడియోతో సినిమా విజువల్ స్కేల్‌ను పరిచయం చేశారు. 'సంచారి' పాట కూడా మంచి ఆదరణ పొందింది. అయితే మహేష్, రాజమౌళి కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ పాట మరింత పెద్ద స్థాయిలో క్లిక్ కావాల్సిందనే అభిప్రాయాలు వచ్చాయి. అందుకే తర్వాత వచ్చే ప్రమోషనల్ కంటెంట్‌పై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. రాజమౌళి సినిమాలకు పాటలు ఎంత పెద్ద బలమో గతంలో చాలాసార్లు రుజువైంది. 'బాహుబలి'లో 'ధీవర', 'పచ్చబొట్టేసిన' పాటలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ఆర్ఆర్ఆర్'లో 'నాటు నాటు' ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 'కొమురం భీముడో' ఎమోషనల్‌గా ఆకట్టుకోగా, 'దోస్తీ' పాట ఇద్దరు హీరోల బంధాన్ని పరిచయం చేసింది. సినిమా విడుదలకు ముందే పాటలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో రాజమౌళి, కీరవాణి కాంబినేషన్‌కు మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. 'వారణాసి'లో ఆరు పాటలు ఉన్నట్లు కీరవాణి గతంలో చెప్పారు. 'సంచారి' తర్వాత మంచి మెలోడీ లేదా మహేష్ బాబు స్టెప్పులతో సాగే పాటను విడుదల చేస్తే ప్రమోషన్లకు మరో ఊపు రావచ్చు. మహేష్ సినిమాల్లో మెలోడీలకు ప్రత్యేకమైన ఆదరణ ఉంటుంది. రాజమౌళి సినిమాల్లోనూ పాటలను కథకు తగ్గట్టుగా రూపొందిస్తుంటారు. ఈసారి ప్రియాంక చోప్రాతో మహేష్ కాంబినేషన్‌లో వచ్చే పాట ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందనేది చూడాలి. మరోవైపు పాటలతో పాటు ఓ పవర్‌ఫుల్ టీజర్ కూడా ఈ సమయంలో మంచి ఆప్షన్ అవుతుంది. కాన్సెప్ట్ వీడియోలో రాజమౌళి ఊహించిన ప్రపంచం, భారీ విజువల్స్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. ఇక మహేష్ బాబు యాక్షన్, డైలాగ్ డెలివరీ, రుద్ర పాత్రలో ఆయన ఇంటెన్సిటీని హైలైట్ చేసే టీజర్ వస్తే అభిమానులకు కావాల్సిన మాస్ కంటెంట్ దొరుకుతుంది. ముఖ్యంగా రాజమౌళి తన హీరోలను పరిచయం చేసే విధానానికి ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. పైగా 'వారణాసి'పై తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషల ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలున్నాయి. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ లాంటి నటీనటులు ఉండటం వల్ల హిందీ, మలయాళ మార్కెట్లలోనూ ప్రచారానికి అవకాశం ఉంది. డిసెంబర్ నుంచి పాటలు, టీజర్ వంటి కంటెంట్‌ను వరుసగా తీసుకొస్తే సంక్రాంతి సీజన్‌ను కూడా ప్రమోషన్లకు ఉపయోగించుకోవచ్చు. ఆ తర్వాత మార్చిలో ట్రైలర్, ప్రధాన నగరాల్లో ఈవెంట్లతో ఏప్రిల్ విడుదలకు రంగం సిద్ధం చేసుకోవచ్చు.

కాజల్‌కు ఈ పార్ట్ 2 కష్టాలేంటి!



ఒకప్పుడు తెలుగు, తమిళ సినిమాల్లో స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు అందుకున్న కాజల్ అగర్వాల్‌కు ఇప్పుడు విచిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. భారీ సినిమాల్లో నటిస్తున్నా ఆమె పాత్రల కోసం ప్రేక్షకులు రెండో భాగం వరకు ఎదురుచూడాల్సి వస్తోంది. కమల్ హాసన్ 'ఇండియన్' సిరీస్‌లో ఎదురైన అనుభవమే ఇప్పుడు మరో పెద్ద ప్రాజెక్టులోనూ కనిపిస్తోంది. దీంతో కాజల్ ఎంచుకుంటున్న పాత్రల గురించి డిఫరెంట్ కామెంట్స్ వినిపిస్తున్నాయి. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'ఇండియన్ 2' కోసం కాజల్ షూటింగ్‌లో పాల్గొన్నారు. సినిమా సెట్స్‌పై ఉన్నప్పటి నుంచే ఆమె పాత్రపై అభిమానుల్లో ఆసక్తి ఉండేది. కానీ 2024లో రెండో భాగం విడుదలైనప్పుడు కాజల్ తెరపై కనిపించలేదు. ఆమె నటించిన సన్నివేశాలను 'ఇండియన్ 3' కోసం ఉంచినట్లు తెలిపారు. కానీ ఆ సినిమా రిలీజ్ పై ఇంకా సరైన క్లారిటీ రావడం లేదు. ఇప్పుడు నితీశ్ తివారీ తెరకెక్కించిన 'రామాయణం'లోనూ కాజల్‌కు దాదాపు అలాంటి అనుభవమే ఎదురైంది. రావణుడిగా యశ్ నటించగా, ఆయన భార్య మండోదరి పాత్రను కాజల్ పోషించారు. అయితే మొదటి భాగంలో ఆమె కనీసం 5 నిమిషాల సీన్ పడలేదు. యశ్‌కు మంచి ప్రాధాన్యం దక్కినా ఆయనతో కాజల్ సన్నివేశాలు పరిమితంగానే ఉన్నాయి. అయితే 'రామాయణం' విషయంలో కాజల్‌కు తన పాత్ర నిడివిపై ముందుగానే అవగాహన ఉంది. మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగంలో మండోదరికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కథలో రావణుడి భార్యగా మండోదరికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ముఖ్యంగా రావణుడి నిర్ణయాలను ప్రశ్నించే సందర్భాల్లో ఆ పాత్రకు నటనకు అవకాశం ఉంటుంది. ఆ సన్నివేశాలను రెండో భాగంలో ఎలా ఉపయోగించుకుంటారనేది చూడాలి. ఇక 'ఇండియన్ 2' ఆశించిన విజయం సాధించకపోవడంతో మూడో భాగం విడుదలపై కన్ఫ్యూజన్ ఉంది. ఈమధ్య ఒక పోస్టర్ తో హింట్ ఇచ్చినా కాజల్ నటించిన సన్నివేశాలను ఎంతవరకు హైలెట్ చేస్తారనేది కీలకం. మరోవైపు 'రామాయణం'ను మొదటి నుంచే రెండు భాగాలుగా ప్లాన్ చేశారు. అందుకే మండోదరి పాత్రకు రెండో భాగంలో ఎక్కువ స్కోప్ ఉండటం కథలో భాగమే. కాజల్ కెరీర్‌లో ఈమధ్య కొన్ని మెయిన్ క్యారెక్టర్లు చేసిన సినిమాలు కూడా వచ్చాయి. 'సత్యభామ'లో పోలీస్ అధికారిణిగా కనిపించారు. అటు 'కన్నప్ప'లో పార్వతి పాత్రను పోషించారు. ఇలా ఒకవైపు తన పాత్ర చుట్టూ కథ నడిచే సినిమాలు చేస్తూనే, మరోవైపు భారీ ప్రాజెక్టుల్లో తక్కువ స్క్రీన్ టైమ్ ఉన్న పాత్రలను కూడా ఎంచుకుంటున్నారు. ఇక నెక్స్ట్ ఎలాంటి సినిమాలు చేస్తారో చూడాలి.

PUBLISHED, OWNED, EDITED BY SREERAMOJU BALANARASIMHA CHARY(PRGI : TGTEL/26/A0688), 4-12-798, DWARAKA MAI NAGAR, VANASTHALIPURAM, RANGA REDDY DIST, HYDERABAD - TELANGANA STATE -500070. 9440189819.
PRINTED AT SMILYS ONLINE #6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, HYDERABAD, RANGAREDDY-TELANGANA-500070, PH:- 9440189819, specialeditiondaily@gmail.com